

ఏసీలు, ఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేత

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ ధర్మాదాయ శాఖలో ఇద్దరు ఏసీలు, ముగ్గురు ఈవోలపై కూటమి ప్రభుత్వం సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. సహాయ కమిషనర్లు వి.గిరికృష్ణ, డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ఈవోలు, బి.మల్లికార్జున్‌రెడ్డి, జానకమ్మ, కుండా వరప్రసాద్‌లను సస్పెండ్ చేస్తూ జూలై 30వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఈ సస్పెన్షన్‌ను తొలగించినట్లు తెలిసింది. ఈ ఐదుగురికి త్వరలోనే పోసింగ్స్ ఇస్తారని సమాచారం.



రాళ్లపాడు : పాత స్పిల్‌వే గేట్ల నుంచి లీకవుతున్న నీరు

ప్రమాద ఘంటికలు

సోమశిల, కండలేరు జలాశయాల వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రెండేళ్లక్రితం సంభవించిన వరదలకు సోమశిల దిగువప్రాంతం పూర్తిగా దెబ్బతిని డేంజర్ జోన్‌గా మారింది. ప్రమాదల నివారణతోపాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన యంత్రాంగం కనుకు వహిస్తోంది. అలాగే రాళ్లపాడు ప్రాజెక్టులోని ఏడు గేట్ల నుంచి నీరు లీకేజీ అవుతోంది. వెంటనే డ్యాం ఇంజనీర్లు స్పందించకపోతే వరద నీరంతా వృథా అవుతాయని రైతాంగం గగ్గోలు పెడుతోంది.

6



సోమశిల దిగువున కనిపించని హెచ్చరిక బోర్డు

మా ఇళ్ల వద్ద మద్యం వద్దు!

"మా ఇళ్ల వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయనీయకండి అంకుల్. మీకు పుణ్యముంటది.' అంటూ నెల్లూరు నగరంలో విద్యార్థులు రోడ్డెక్కారు. వీరికితోడుగా మహిళలు, వృద్ధులు కూడా ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. చిల్డ్రన్స్‌పార్కు నుంచి హైవే మీదుకు వెళ్లే రహదారిపై వీరు ఆందోళన చేపట్టడంతో వాహన రాకపోకలు స్తంభించాయి. చివరకు ఎక్సైజ్ అధికారులు నచ్చచెప్పడంతో వారు శాంతించారు. ఇందుకూరు పేటలోనూ మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన జరిగింది.

7



ప్లకార్డులు చేతబట్టి నిరసనలో పాల్గొన్న విద్యార్థులు

రబీ సాగుకు సన్నద్ధం 6



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం, కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు

అమరులారా మీసేవలు మరువలేం!

విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరులను స్మరిస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా పోలీసులు భారీ ర్యాలీలు నిర్వహించారు. నెల్లూరులోని పోలీస్‌కవాతు మైదానంలో అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఆనంద్, జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన ర్యాలీలో పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పోలీసులు ప్రదర్శనలు నిర్వహించారు.

6

మరో 8 స్టాక్‌పాయింట్లు

- ఇప్పటికే మూడు చోట్ల ఇసుక అమ్మకాలు
- రీచ్‌లలోకి వెళ్లేందుకు ర్యాంపులు
- వారంలో అన్నిచోట్లా యార్డులు

జిల్లా వాసులకు ఇసుక కష్టాలు తీరనున్నాయి. ఈ నెల 15న పర్యావరణ అనుమతులు లభించడంతో వీలైనన్ని రీచ్‌లను ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో స్టాక్ పాయింట్ల ద్వారా ఇసుకను విక్రయిస్తున్నారు. అదనంగా మరో 8 చోట్ల స్టాకుపాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. అయితే, ఆన్‌లైన్‌తోపాటు నేరుగా స్టాక్ పాయింట్‌కు వెళ్లి ఇసుకను బుకింగ్ చేసుకొని తరలించుకోవచ్చు.

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటికే మూడు ప్రాంతాలతోపాటు మినగల్లు, ముదివర్తి పాళెం, పల్లిపాడు, విరువూరు ప్రాంతాల్లో రీచ్‌లకు సమీపంలో స్టాక్ యార్డులను ఏర్పాటు చేయనున్నారు. అలాగే, నెల్లూరు నగర ప్రజల కోసంగా మరో నాలుగు ప్రాంతాల్లో పెన్నానది సమీపంలోని భగత్ సింగ్‌కాలనీ, బొడిగాడితోట ప్రాంతం, దీనదయాళ్ నగర్, పాత మున్సిపల్ కార్యాలయం వద్దనున్న పొర్లుకట్ట ప్రాంతాల్లో స్టాక్ పాయింట్ల ఏర్పాటుకు ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ శాఖలు సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలోని పెన్నానదిలోకి



ఇసుకను బయటకు తీసుకొచ్చేందుకు అవసరమైన ర్యాంపు (రోడ్డు) పనులు జోరుగా సాగుతున్నాయి. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో 11 స్టాక్ పాయింట్‌లను ప్రారంభించేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

● ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లకు ఉచితం

పేదలకు ఉచిత ఇసుకను అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకూ ఎడ్లబండ్లతో మాత్రమే ఎక్కడ నుంచైనా ఇసుకను ఉచితంగా తీసుకొని వెళ్లేందుకు అనుమతి ఉన్నది. తాజాగా ట్రాక్టర్లకు కూడా అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకొన్నారు. ఎవరైనా తమ సొంత అవసరాల కోసం కూలీలను పెట్టుకొని ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ఇసుకను తీసుకొని వెళ్లవచ్చు. స్టాక్ పాయింట్ ఉన్న ప్రాంతాల్లో కాకుండా మిగతా ప్రాంతాల్లో ఇసుకను తరలించుకోవచ్చు. అయితే, ఇందుకు సంబంధించి పూర్తి మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది.

త్వరలోనే రీటెండర్లు పిలుస్తాం

జిల్లాలో ఇప్పటివరకు ఉన్న మూడు స్టాక్ పాయింట్లతోపాటు మరో 8 స్టాక్ పాయింట్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాము. త్వరలోనే వీటికి టెండర్లు పిలుస్తాము. నెల్లూరులో నాలుగు ప్రాంతాల్లో స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేస్తున్నాము. ప్రజలకు వీలైనంత ఇసుకను అందుబాటులో ఉంచేలా అన్ని చర్యలు చేపడుతున్నాము.

- చంద్రశేఖర్, మైనింగ్ డీడీ

సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ!


నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు | 40 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళిక

● జిల్లాలో ఐదు పీసీలు, 13 డీసీలు, 765 డబ్ల్యూఏలు ● నీటి యాజమాన్యంలో పెరగనున్న బాధ్యత ● రాజకీయ వర్గాల్లో మొదలైన సందడి



వ్యవసాయంలో కీలకమైన సాగునీటి సంఘాల ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. రైతులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈ ఎన్నికల నోటిఫికేషన్‌ను జలవనరుల శాఖ ఉన్నతాధికారులు సోమవారం విడుదల చేశారు. 40 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. నవంబరు 29వ తేదీన ప్రాజెక్టు కమిటీల ఎన్నికతో ఈ ప్రక్రియ ముగుస్తుంది. ఈ ఎన్నికల నిర్వహణకు అవసరమైన రెవెన్యూ సిబ్బందిని కలెక్టర్ నామినేట్ చేయనున్నారు. ఆ తర్వాత ఆయా సంఘాల పరిధిలో ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తారు. మేజర్ ఇరిగేషన్ ప్రాంతాల్లోని కమిటీల్లో ఆరు నుంచి 12 మంది సభ్యులు, మైనర్ ఇరిగేషన్ ప్రాంతాల్లోని కమిటీల్లో గరిష్ఠంగా ఆరుగురు సభ్యులుగా ఎన్నికకావచ్చు. దీంతో గ్రామాల్లో సందడి మొదలైంది. సార్వత్రిక ఎన్నికలను తలపించేలా సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతుంటాయి. ప్రస్తుతం రూ.5 లక్షల వరకు పనులను సాగునీటి సంఘాలు ఎటువంటి టెండర్లు లేకుండా చేయవచ్చు. ఈ మొత్తాన్ని రూ.10 లక్షల వరకూ పెంచుతారన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావాహులు ఎక్కువయ్యారు.

నెల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి యాజమాన్యంలో నీటి సంఘాలది కీలకపాత్ర. ఆయా గ్రామాలు, కాలువల పరిధిలో నీటి వృథా జరగకుండా ప్రతీ ఎకరాకు నీటిని అందించేలా ఈ సంఘాలు కృషి చేస్తుంటాయి. గ్రామ, మండల స్థాయిలో సాగునీటి సంఘాల పాలకవర్గాలకు విశిష్ట గుర్తింపు ఉంటుంది. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలు నిర్వహించకపోగా కనీసం నామినేటెడ్ కమిటీలను కూడా నియమించలేదు. రైతాంగం అవస్థలను గమనించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఈ కమిటీలన్నింటికీ ఇరిగేషన్ అధికారులే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో రెండు మేజర్ ప్రాజెక్టు కమిటీలు(పీసీ) సోమశిల, పెన్నా డెల్టాలు ఉన్నాయి. ఈ రెండింటికి సోమశిల ఎస్ఈ, రెగ్యులర్ ఇరిగేషన్ ఎస్ఈలు ఇన్‌చార్జ్‌గా వ్యవహరి స్తున్నారు. అలానే మరో మూడు మీడి యం ప్రాజెక్టు కమిటీలు గండిపాలెం ప్రాజెక్టు, కనుపూరు కెనాల్, స్వర్ణముఖి ఆయకట్టు సిస్టమ్ ఉన్నాయి. వీటితో పాటు 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ), 765 చిన్న తరహా సాగునీటి సంఘాలు(డబ్ల్యూఏ) ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఇన్‌చార్జ్‌లుగా ఉండగా, చిన్న తరహా సాగునీటి సంఘాలకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌స్థాయి అధికారులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు.



● పనులు చేయకుండానే బిల్లులు

నీటి సంఘం పరిధిలోని ఏ కాలువలో పనులు చేయాల్సి ఉన్నా ఆ సంఘం పాలకవర్గమే చూసుకునేది. ఈ సంఘాలకు ఆర్థిక లావాదేవీలు చేసే అధికారం కూడా ఉంది. సంఘంలోని సభ్యులంతా స్థానికులు కావడంతో వారు బాధ్యతగా వ్యవహరించేవారు. రైతులకు ఏ సమస్య వచ్చినా వెంటనే వీరి దృష్టికి తెచ్చేవారు. రైతులు చెల్లించే శిస్తును ఈ సంఘాలకు జమ చేసి తద్వారా కాలువల్లో అభివృద్ధి పను లు చేసేవారు. కానీ గడిచిన ఐదేళ్లుగా శిస్తు వసూలు చేసేవా రు కూడా లేకుండా పోయారు. ప్రస్తుతం జిల్లాలో రూ.50 కోట్ల వరకు శిస్తు వసూలు చేయాల్సి ఉంది. ఈ ప్రభావం నీటి యాజమాన్యంపై తీవ్రంగా పడుతోంది. కాలువల్లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులను సాగు నీటి సంఘాల ద్వారా చేపడుతుంటారు. వీరంతా రైతులు కావడంతో పనులన్నీ పక్కాగా చేయించేవారు. కానీ గడిచిన ఐదేళ్లుగా ఈ సంఘాలు లేకపోవడంతో ఓఅండ్ఎం పనులను టెండర్ల ద్వారా అప్పగించారు. వీటిని బినామీల పేర్లతో దక్కించుకున్న వైసీపీ నేతలు.. పనులు చేయకుండానే బిల్లులు రికార్డు చేసుకోవడం గమనార్హం.

● నాడు గాలికొదిలేశారు

సాగునీటి సంఘాలకు చాలా కాలం నుంచి ఎన్నికలు జరగలేదు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలోనూ ఎన్నికలకు ఇబ్బందులు ఉండడంతో అప్పటి ప్రభుత్వం రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ నీటి సంఘానికి నామినేటెడ్ కమిటీని నియమించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సంఘాలను గాలికొదిలేసింది. టీడీపీ ప్రభుత్వం నియమించిన కమిటీలను రద్దు చేసి ఆ బాధ్యతలను ఇరిగేషన్ ఇంజనీర్లకు అప్పగించింది. కమిటీలను రద్దు చేసినంత స్పీడు కొత్త కమిటీలను నియమించడంలో వైసీపీ ప్రభుత్వం చూపించలేదు. ఐదేళ్లపాటు అటు ఎన్నికలు జరపక, ఇటు నామినేటెడ్ కమిటీలను నియమించకుండా సాగును నిర్లక్ష్యం చేసింది. అదే సమయంలో కాలువలపై కీలకంగా వ్యవహరించే లస్కర్లను కూడా తొలగించడంతో రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

పారదర్శకంగా పూర్తి చేస్తాం

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేశాం. ప్రభుత్వం సూచించిన షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా ఎన్నికలను పూర్తి చేస్తాం. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన రెవెన్యూ సిబ్బందిని కలెక్టర్ నామినేట్ చేస్తారు. ఆ తర్వాత ఓటర్ల జాబితా రూపొందిస్తాం.

- దేశే నాయక్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ

బటన్ నొక్కి.. విద్యార్థులను తొక్కి!

● అందని ఫీజు రీయింబర్స్‌మెంట్ ● ఫీజుల కోసం కాలేజీ నిర్వాహకుల ఒత్తిళ్లు

● అవస్థల్లో ఉన్నత విద్య విద్యార్థులు ● చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టి

కావలికి చెందిన ఓ రైతు కుమార్తె ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతోంది. ఇటీవల పరీక్షలు జరిగాయి. రూ.62వేలు ఫీజు చెల్లిస్తేనే పరీక్షకు హాజరు కానివ్వమని యాజమాన్యం తేల్చి చెప్పింది. ఆ విద్యార్థినికి విద్యాదీవెన కింద సొమ్ము జమ కాలేదు. దీంతో ఏం చేయాలో అర్థం కాక అప్పుచేసి మరీ ఫీజు చెల్లించారు.

ఇది ఈ ఒక్క విద్యార్థిని పరిస్థితేకాదు. జిల్లాలో అత్యధికశాతం మంది విద్యార్థులు ఇలాంటి కష్టాలే ఎదుర్కొంటున్నారు.

ఇంజనీరింగ్, డిగ్రీ, డిప్లొమో, పీజీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థులు జిల్లావ్యాప్తంగా 35 వేల మందికిపైగా ఉన్నారు. సాధారణ, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఎక్కువ మంది ఉండటంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం చెబుతుండటంతో విద్యార్థులు నలిగిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పక్కనపెట్టి విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద నగదు అందచేస్తామని చెప్పి విద్యార్థులను అవస్థల కూపంలోకి నెట్టేసింది. అనుకున్న సమయానికి నగదు అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, కాపు, ముస్లిం, క్రిస్టియన్ వర్గాలకు చెందిన విద్యార్థులకు వారు కళాశాలల్లో చెల్లించే రుసుము మేరకు సొమ్ము అందించాలి. 75 శాతం హాజరు ఉన్నవారికి తప్పనిసరిగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి. కోర్సు ఆధారంగా ఏడాదికి నాలుగు విడతల్లో అందచేస్తారు. 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగు విడతల్లో రూ.90కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం చివరి సమయంలో నిధులు విడుదల చేస్తున్నామని బటన్ నొక్కినా నేటికీ విద్యార్థుల ఖాతాల్లో నగదు మాత్రం జమకాలేదు. వసతి దీవెన కింద రుసుముతోపాటు మెస్ చార్జీలు, పుస్తకాల కొనుగోలు, ఇతర అవసరాల కోసం నగదు చెల్లించాలి. ఏడాదికి రెండుసార్లు ఖాతాల్లో వేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. ఐటీఐ విద్యార్థులకు

సుమారు రూ.90 కోట్లు పెండింగ్

రూ.10వేలు, డిప్లొమోకు రూ.15వేలు, డిగ్రీ, పీజీ, ఇతర కోర్సులు చేసేవారికి రూ.20వేలు చెల్లించాలి. అయితే గడిచిన రెండు విద్యాసంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు.

● యాజమాన్యాల ఒత్తిడి

జిల్లాలో అత్యధికశాతం మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థల్లోనే చదువుకుంటున్నారు. తప్పనిసరిగా ఫీజులు చెల్లిస్తేనే హాల్‌టికెట్లు ఇస్తామని, ధ్రువపత్రాలు అందచేస్తామని యాజమాన్యాలు ఖచ్చితంగా చెబుతున్నాయి. దీంతో విద్యార్థులు తమ సర్టిఫికెట్లు కూడా తెచ్చుకోలేక, కుటుంబ సభ్యులను నగదు అడగలేక మథన పడుతున్నారు. కొందరైతే అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లిస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వమైన నిర్ణయం తీసుకుని తమ బిడ్డలకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

- నెల్లూరు (విద్య)



● కూటమి ప్రభుత్వం కసరత్తు

నేరుగా కాలేజీలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై విధివిధానాలను సిద్ధం చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గందరగోళంగా మారిన ఈ పథకాన్ని గాడిన పెట్టేందుకు మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ సాకుతో విద్యార్థులకు గత మార్చిలో బటన్ నొక్కినా బ్యాంకు ఖాతాలకు విద్యాదీవెన నగదు చేరలేదు. దీంతో ప్రతి విద్యార్థి సగటున రూ.50వేల నుంచి లక్షన్నర వరకు ఫీజులు బకాయిలు ఉండిపోయాయి. పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్నే అమలు చేసేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందిస్తున్నారు. త్వరలోనే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని కళాశాలల ప్రతినిధులు చెబుతున్నారు.

సమాజానికి పోలీసు వ్యవస్థ వెన్నెముక

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- పోలీసు అమరవీరులకు ఘన నివాళి

నెల్లూరు (క్రైం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి పోలీసు వ్యవస్థ వెన్నెముకని, దేశం లోపల ఉన్న ఇంటర్నల్ టెర్రరిజం, నక్సలిజం, సంఘ విద్రోహశక్తులను అణచివేయడంలో పోలీసుల పాత్ర కీలకమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్ వద్ద ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. అంతకుముందు పోలీసు కవాతు మైదానంలో అమరవీరులకు నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సే ఊపిరిగా ప్రజల శ్రేయస్సు కోసం ప్రాణాలనే పణంగా పెట్టిన యోధులకు వెలకట్టలేని మీ త్యాగాలకు నా హృదయాంజలి అర్పిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఓ ఆనంద్ మాట్లాడుతూ ప్రజా రక్షణకు పోలీసుల సేవలు స్ఫూర్తిదాయకమని, అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమంటూ కొనియాడారు. ఎస్పీ మాట్లాడుతూ కర్తవ్య నిర్వహణలో ప్రమాదాలకు తలవంచకుండా, ప్రాణాలను లెక్క చేయకుండా, నింగి సైతం మీకు వంగి సలాం చేస్తోందని, నిన్ను తనలో దాచుకున్నందుకు నేలతల్లి గర్విస్తోందని, విధి నిర్వహణలో మీ బలిదానాలు వెలకట్టలేనివని, ఓ వీర జవాన్‌లారా మీకు మా నీరాజనాలు' అంటూ శ్రద్ధాంజలి ఘటిస్తూ మాట్లాడారు. జిల్లాలో అమరులైన పోలీసు కుటుంబాలకు ఆర్థిక సహాయ చెక్కులు, జ్ఞాపికలను మంత్రి ఆనం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మేయర్ పొట్లూరి స్రవంతి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.





అమరులైన పోలీసుల కుటుంబసభ్యులతో మంత్రి ఆనం,

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

- నగరంలో ర్యాలీ

అమరవీరుల సంస్మరణ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. పోలీసు పెరేడ్ మైదానం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అమర వీరులకు జోహార్లు అర్పిస్తూ ఈ ర్యాలీ సాగింది. ర్యాలీలో అదనపు ఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రెండు దశాబ్దాల క్రితం ఇద్దరు వ్యక్తులతో మొదలైన 'మన ఊరు పిలుస్తోంది' ట్రస్ట్ ఇప్పుడు నూటయాభై మందికి చేరుకుంది. గ్రామంలోని యువత, విద్యావంతులు, బయటిప్రాంతంలో పనిచేసే ఉద్యోగులు, వ్యాపారులను ప్రోత్సహించి ట్రస్ట్ ఏర్పాటులో కీలకమయ్యేలా చేశారు. విద్యార్థుల మొదలు గ్రామస్థుల కోసం నిత్యం ఏదో ఒక సేవ చేస్తూ ట్రస్ట్ సభ్యులు ముందుకు కదులుతున్నారు. అలాగే, సర్పంచు, సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ కీలకంగా వ్యవహరించి ఏకగ్రీవం అయ్యేల రాజకీయ పార్టీల నేతలను ఒప్పిస్తున్నారు. అంతటి మహోన్నత సేవలు అందిస్తున్న ఆ ట్రస్ట్ గురించి తెలుసుకోండి.

- జలదంకి (ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి ట్రస్ట్‌మి!

- లింగరాజు అగ్రహారంలో ఇద్దరు ఉద్యోగులతో మొదలై 150 మందికి చేరిక
- విద్య, వైద్యంతోపాటు గ్రామాభివృద్ధే లక్ష్యం

ఆదర్శం aadarsham

జలదంకి రోడ్డుకు మరమ్మతు చేయిస్తూ...

జలదంకి మండలంలోని లింగరాజు అగ్రహారానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు గొట్టిపాటి మాల్యాద్రి, గాలి శ్రీనివాసులు 20 ఏళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ఆదేశాలతో డిప్యుటేషన్‌పై సాక్షరభారత్, జనవిజ్ఞాన వేదిక తరఫున పని చేశారు. ఆ సమయంలో వారి మదిలో పుట్టిన ఆలోచనే మన ఊరు పిలుస్తోంది. గ్రామాభివృద్ధి కోసం ట్రస్ట్ ఏర్పాటుకు నాంది పలికింది. ఇంతింతై.. వటుడింతై అన్నట్టుగా గ్రామానికి చెందిన పలు రకాల ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడిన వారితో 150 మందితో సభ్యులను తయారు చేశారు. ఈ ట్రస్ట్‌కు బీజం పడిన మొదట్లో గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గదుల కొరతను గమనించారు. అదనపు తరగతి గదుల కింద పూరిపాకను ఏర్పాటు చేశారు. ఇలా మొదలై నేడు పలురకాల అభివృద్ధి చేస్తున్నారు. ఎంత ఎదిగినా తల్లిదండ్రులు, జన్మస్థలాన్ని మరువకుండా తమకు చేతనైనంత సాయం చేస్తూ ఇతరులకు స్ఫూర్తి నింపుతున్నారు.

ట్రస్ట్ సభ్యులు వీరే!

ట్రస్ట్ ఫౌండర్లు, సభ్యులు గాలి శ్రీనివాసులు కుట్టుబోయిన లక్ష్మీనారాయణ గొట్టిపాటి మురళీ, బెల్లం మధు, గాలి చైతన్య, కొర్రపాటి ప్రమోద్, గొట్టిపాటి రమేష్, నంబూరి మస్తానయ్య గొట్టిపాటి మాల్యాద్రి, యనమల క్రిష్ణయ్య, తల్లపనేని చెన్నకేశవ, మట్టెపు క్రిష్ణయ్య, గొట్టిపాటి రామ్మూర్తి, గాలి క్రిష్ణ, గాలి మధు, కొర్రపాటి మహేష్, గాలి మహేంద్ర, గొట్టిపాటి అశోక్, దావులూరి మధు, సర్పంచ్ మంగల తిరుమల, మాజీ జడ్పీటీసీ యనమల శ్రీనివాసులు ఉన్నారు.



ట్రస్ట్ ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో గ్రామస్తులు



విద్యార్థులకు బహుమతుల అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సేవా కార్యక్రమాలివే..


- యువతను ప్రోత్సహించేందుకు క్రికెట్ జట్ల ఏర్పాటు, పండుగల సమయంలో వివిధ ప్రాంతాల్లో జరిగే టోర్నీల్లో ఆడించడం. క్రికెట్ కిట్ల అందజేత
- గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇప్పిస్తున్నారు. అలాగే శస్త్రచికిత్స అవసరం అయ్యే వారికి ప్రైవేటు వైద్యశాలలను సంప్రదించడం. రక్తదాన శిబిరాలు నిర్వహించడం.
- గ్రామంలో రాజకీయ కక్షలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఆయా పార్టీల నాయకులతో చర్చలు జరిపి గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడం.
- సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేలా చూడటం
- గ్రామం నుంచి జలదంకి, కావలికి వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేయించడం. ఇందుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సంప్రదించి ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం చేయడం.
- గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్తదానంతో కలిగే ప్రయోజనాలను వివరించడం
- అంటువ్యాధులు ప్రబలకుండా వీధులు శుభ్రంగా ఉండేలా పారిశుధ్యం- పరిశుభ్రతపై అవగాహన పెంచడం. ఇది నిరంతర ప్రక్రియ
- ఆలయాల అభివృద్ధికి ట్రస్ట్ తమ వంతు సహాయసహకారాలు అందజేయడం.
- ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ట్రస్ట్ వారితో కలసి పనిచేయడం. సర్పంచ్‌గా ఎవరు ఎన్నికైతే వారితో కలిసి అభివృద్ధిలో భాగస్వాములవడం, పనులకు సహాయకారిగా ఉండటం.
- పంటలకు తెగుళ్లు సోకితే వ్యవసాయ శాస్త్రవేత్తలను పిలిపించి రైతులకు సలహాలు ఇప్పించడం. తెగుళ్ల అరికట్టేందుకు మందులు పిచికారీ చేయించడం. అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడకుండా అవగాహన కల్పించి అన్నదాతలకు పెట్టుబడి ఖర్చులు తగ్గేలా చేయడం.
- సాగునీటి చెరువులు, కాలువలకు సోమశిల జలాలు వచ్చేలా అధికారులను సంప్రదించి సాగునీటి ఇబ్బందులు లేకుండా ట్రస్ట్ పనిచేస్తోంది.
- ఉపాధిహామీ పనులను పేదలకు కల్పించడం. పొలాలకు దారులు వేయించడం.
- ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా ఉపకరణాలు అందజేయడం. సాయంత్రం ట్యూషన్లు చెప్పించడం.
- స్వాతంత్ర్య దినోత్సవాన ఆటలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం
- గ్రామ ప్రధాన కూడళ్లలో సిమెంటు బెంచీల ఏర్పాటు
- హిందూ శ్మశానవాటికలో ముళ్లకంప, చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచడం
- వర్షాకాలంలో పాఠశాల ఆవరణలో నీరు నిల్వకుండా మట్టి వేసి ప్రాంగణం ఎత్తు పెంచడం
- విద్యకు దూరమైన పిల్లలను పిల్లల్ని గుర్తించి తల్లిదండ్రుల్లో అవగాహన పెంచి మరలా బడులు, కాలేజీలకు వెళ్లేలా చేయడం
- పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బయట ప్రాంతాల్లో చదివే పిల్లలకు ఆర్థికసాయం చేయడం
- ఉన్నత చదువులు పూర్తి చేసిన ఉద్యోగాల కల్పనకు సహాయం
- కోచింగ్ సెంటర్ల నిర్వాహకులను సంప్రదించి ఉచితంగా శిక్షణలు ఇప్పించడం



డ్యాం ముందు ప్రమాదకర ప్రాంతం ఇది. ఇక్కడ కనిపించని హెచ్చరిక బోర్డు



బ్రిడ్జికి ఇరువైపులా కానరాని రక్షణ దిమ్మెలు



రక్షణ గోడలేని అప్రాన్... ఇక్కడ పడితే అంతే!

ప్రమాద ఘంటికలు

మోగుతున్నాయ్!

- గత వరదకు దెబ్బతిన్న 'సోమశిల'
- హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు

సోమశిల జలాశయం వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. డేంజర్ జోన్ల వద్ద కనీసం సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో పర్యాటకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడున్న అధికారుల తీరు విధులకు వచ్చామా? వెళ్లామా? అనే ధోరణిలో ఉందని, జలాశయ పరిసర ప్రాంతాలు, ప్రమాదాల నివారణ చర్యలపై ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వరదలకు జలాశయం ముందు కట్టడాలు ధ్వంసమై అప్రాన్, డౌన్‌స్టీమ్ ప్రాంతాలు డేంజర్ జోన్లుగా మారిన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాలలో సందర్శకులు తిరగకుండా నివారణ చర్యలు, హెచ్చరిక బోర్డులు పెట్టాలి. కానీ ఆ దిశగా పట్టించుకొన్న దాఖలాలు లేవు. అలాగే 11, 12 క్రస్ట్‌గేట్ల నుంచి నీరు సరఫరా చేసే ప్రాంతంలో ఏర్పాటు చేసిన బ్రిడ్జి రాకపోకలకు ముఖ్య ఆధారం. అలాంటి బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ దిమ్మెలు తొలిగిపోయి రెండేళ్లు గడుస్తున్నా ఏర్పాటు చేయలేదు. ఈ ప్రాంతంలో 10 నుంచి 30 అడుగుల వరకు లోతు ప్రాంతాలు ఉన్నాయి. వాహనదారులు ఏమాత్రం అశ్రద్ధ వహించినా ఈ గుంతలో పడటం తథ్యం. మరోవైపు అప్రాన్‌లో అభివృద్ధి పనులు చేస్తున్న గుత్తేదారు కూడా పనులు చేసే చోట జాగ్రత్తలు తీసుకోకపోవడం గమనార్హం.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

- 15,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 15,200 క్యూసెక్కుల వరద వస్తోం ది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 60.011 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రాళ్లపాడులో నీళ్ల లీకేజీ!

ఏడు గేట్ల నుంచి నీటి వృథా

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వేలోని గేట్ల నుంచి నీరు ఉధృతంగా లీకేజీ రూపంలో మన్నేరులోకి వెళుతోంది. పాత స్పిల్‌వేలో 10 సాధారణ గేట్లు, రెండు పూడు గేట్లు ఉన్నాయి. ఈ పది గేట్లలో 1, 2, 10 గేట్లు మినహా మిగిలిన ఏడు గేట్ల నుంచి నీరు లీకవుతోంది. ప్రధానంగా 6, 7, 8 గేట్ల నుంచి నీరు లీకేజీ ఎక్కువగా ఉంటోంది. ఈ విషయమై ఏఈ చంద్రమౌళి మాట్లాడుతూ గేట్ల వద్ద గడ్డి పెట్టించి లీకేజీని అరికడతామని స్పష్టం చేశారు.

- పూడిక తొలగింపు

ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల్లో పూడిక తీత, జంగిల్ తొలగింపునకు నోచుకోలేదు. దీంతో కాలువలకు నీరు విడుదల సమయంలో తీవ్ర ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. ఈ విషయమై ఇటీవల ప్రాజెక్టును సందర్శించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అధికారులు సమస్యను వివరించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం నుంచి ఎడమ కాలువ మొదటి నుంచి పూడిక తీత, జంగిల్ తొలగింపు పనులను అధికారులు చేపట్టారు. జరుగుతున్న పనులను డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చంద్రమౌళి పరిశీలించారు. ఈ పనులు పూర్తయ్యాక కుడి కాలువ పూడికతీత, జంగిల్ తొలగిస్తామని వారు తెలిపారు.



ఎడమ కాలువలో పూడికతీత, జంగిల్ తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



ఇలాగా కూడా చేయవచ్చా ?

ఇదేంటి... ఇలాంటి ఆక్రమణలు కూడా ఉంటాయా..? రోడ్డుపై ఉండే విద్యుత్ స్తంభంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను కలిపి ఆక్రమించాడు మండలంలోని మామిడిపూడి దళితవాడకి చెందిన ఓ వైసీపీ నాయకుడు. మన ప్రభుత్వమేగా అడిగేదెవరు... అనుకున్నాడో.. ఏమో.. గతంలో ఆయన విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిసి ఆక్రమించి ప్రహరీ గోడ కట్టేశాడు. ఈ విషయమై తాజాగా టీడీపీ నాయకులు ఎంపీడీవో నాగమణికి ఫిర్యాదు చేశారు.

- ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి)

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోడానికి ప్రభుత్వం ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించిందని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కోచింగ్ తీసుకోవాలను కొనేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రేపు 'నర్సింగ్' ఎన్నికలు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 23వ తేదీన జరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఎన్నికల ఓటింగ్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరుగుతాయి. ఇందులో రెండు ప్యానళ్లు తపపడుతున్నాయి.

ఒత్తిళ్లకు గురికాకుండా ఓటేయండి

- ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి రాంప్రసాద్

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సుల జిల్లా ఎన్నికల్లో అధికార, అనధికార, ఒత్తిళ్లకు గురికాకుం డా నచ్చిన ప్యానెల్‌కు ఓటు వేయాలని ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఈ ఎన్నికలు రహస్య బ్యాలెట్ ద్వారా జరుగుతాయని, ప్రభుత్వ నర్సులు స్వతంత్రంగా ఓటేయవచ్చని తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా నర్సులను చైతన్య పరిచామని పేర్కొన్నారు. నర్సులందరూ తప్పనిసరిగా ఎన్నికలకు హాజరై, నర్సుల సంక్షేమానికి పాటుపడే ప్యానెల్‌ను స్వేచ్ఛగా ఎన్నుకోవాలని తెలిపారు. ఓటు నర్సుల ఉద్యోగ భవిష్యత్తును నిర్దేశిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యయుత వాతావరణంలో స్వేచ్ఛగా జరపాలని అధికారులను కోరారు.

సాగుకు సమాయత్తం

- కరుణించిన వరుణుడు.. పుష్కలంగా సాగునీరు
- దుక్కి పనుల్లో అన్నదాతల బిజీ
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్ ప్రధానమైంది. వరి పంటకే అధిక శాతం రైతులు ప్రాధాన్యమిస్తారు. మెట్ట ప్రాంతాల్లో వేరుశనగ, మినుము, నువ్వులు, అలసంద తదితర పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది సోమశిలలో నీరు పుష్కలంగా అందుబాటులో ఉంది. దాదాపు 60 టీఎంసీల నీరు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సంగం, నెల్లూరు బ్యారేజి, కావలి కాలువ, సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు కాలువ, అల్లూరు చెరువు, కండలేరు డ్యాంల ద్వారా సాగునీరు అందుతోంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేసింది. దాదాపు 2లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉండగా, 64,019 క్వింటాళ్ల మేర వరి విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇంకా 35981 క్వింటాళ్ల రాగులు, సజ్జలు, వేరుశనగ, మినుము, శనగ, మొక్కజొన్న తదితర పంటల విత్తనాలు కూడా రైతులకు అందుబాటులో ఉంచేందుకు ఏపీ సీడ్స్‌తోపాటు ప్రైవేటు డీలర్లతో వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే సమావేశాలు నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఏపీ సీడ్స్ ద్వారా 12 వేల క్వింటాళ్లు, 80వేల క్వింటాళ్ల విత్తనాలు అధీకృత ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. 8వేల క్వింటాళ్ల విత్తనాలు మాత్రం రైతుల నుంచి రైతులు సేకరించుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

- 6200 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో 6200 క్వింటాళ్ల విత్తనాలను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది. ఇందులో బీపీటీ-5204 రకం 900 క్వింటాళ్లు అదేవిధంగా కెఎన్ఎం-1638 రకం 4500, ఎన్ఎల్ఆర్-34449 రకం 800 క్వింటాళ్లు ఉన్నాయి. కిలో రూ.5 సబ్సిడీతో అందిస్తున్నారు.



ఆర్ఎన్ఆర్-15048, ఎన్ఎల్ఆర్-3354 రకాలు కూడా త్వరలో అందుబాటులో ఉంచుతామని అధికారులు చెబుతున్నారు.

- 25,590 మెట్రిక్ టన్నుల ఎరువులు

రబీలో జిల్లాకు దాదాపుగా 2.28లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందని వ్యవసాయశాఖ అంచనా. ప్రస్తుతం జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో 25590 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. వీటిలో 8012 మెట్రిక్ టన్నుల యూరియా, 2206 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1194 మెట్రిక్ టన్నుల ఎంఓపి, 13814 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 364 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి ఎరువులు ఉన్నాయి. రెండ్రోజుల్లో మరో 5500 మెట్రిక్ టన్నుల యూరియా, 1800 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు దిగుమతి చేసుకోవడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఇప్పటికే ప్రైవేటు డీలర్లకు సూచనలు ఇచ్చాం. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం కూడా. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల జాబితా ప్రాథమిక సేకరణ జరిగింది. పూర్తిస్థాయి జాబితా సిద్ధం చేసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు. నష్టపోయిన రైతులకు సబ్సిడీతో విత్తనాలు అందిస్తాము.



- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి





ఇళ్ల మధ్య మందు షాపు

వద్దే వద్దు..!

వాహనాలను అడ్డుకొని మహిళల నిరసన

భారీగా ట్రాఫిక్ జామ్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ నివాసాల మధ్య ఉన్న వైన్‌షాపును వెంటనే తొలగించాలని పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు డిమాండ్ చేశారు. ఫ్లకార్డులు చేత పట్టుకొని నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు జాతీయ రహదారి వద్ద సోమవారం నిరసన తెలిపారు. చిల్డ్రన్స్ పార్క్ వైపు నుంచి జాతీయరహదారి పైకి వాహనాలు రాకుండా అడ్డుకున్నారు. సుమారు గంటకు పైగా రోడ్డుపై నిరసన తెలపడంతో హరనాథ పురం వరకు రోడ్డు కు రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. బాలాజీనగర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ససేమిరా అన్నారు. చివరకు బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు ఘటనా స్థలానికి చేరుకొని ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వగా వారు ఆందోళన విరమించారు.

ఇందుకూరుపేటలోనూ ఆందోళన

ఇందుకూరుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపు మాకొద్దని ఇందుకూరుపేట ప్రజలు సోమవారం ఆందోళనకు దిగారు. గ్రామం నడిబొడ్డులో మద్యం షాపు ఎలా ఏర్పాటు చేస్తారని నిర్వాహకులను వారు నిలదీశారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో అటూ, ఇటూ రెండు మద్యం షాపులు ఉంటే మధ్యలో ఇంకో మద్యం షాపు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు.ఆందోళనతో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



అంత లారీ బొమ్మలా బోర్లా!

నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై కదిరినాయుడుపల్లి వద్ద కేతామన్నేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జిపై నుంచి భారీ లారీ అదుపుతప్పి సర్వీస్‌రోడ్డుపై బోల్తాపడిన సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. నెల్లూరు నుంచి కడప వైపు ఈ లారీ వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

– మర్రిపాడు (ఆంధ్రజ్యోతి)

రైలు ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి

నెల్లూరు(క్రైం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో మాట్లాడుతూ రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని విశ్రాంత అటవీశాఖ ఉద్యోగి మృతి చెందిన ఘటన నగరంలోని కొండాయపాలెం గేటు సమీపంలో సోమావారం జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లో అటవీశాఖ విశ్రాంత ఉద్యోగి ప్రసాద్(62) నివాసం ఉంటున్నారు. ఆయన సోమవారం జీజీహెచ్‌లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ పనులు చూసుకుని ఇంటికి బయలుదేరారు. ఫోన్‌లో మాట్లాడుకుంటూ కొండాయపాలెం రైల్వేగేటు దాటుతుండగా చెన్నై వైపు వెళ్లే రైలు ఆయనను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్ మృతి చెందారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్‌ఐ జీ.మాలకొండయ్య సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య జెస్సిబా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● పడుగుపాడు స్టేషన్‌లో పట్టాలు దాటుతూ మరొకరు...

బిట్రగుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పడుగుపాడు రైల్వే స్టేషన్‌కు ఉత్తరం వైపు ప్లాట్‌ఫామ్ చివరలో పట్టాలు దాటుతుండగా సోమవారం రైలు ఢీకొని (65-70)సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌కుమార్ తెలిపారు. మృతుడు తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, గల్ల బ్లూ రంగు బోస్ కంపెనీ లుంగీ, ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. చొక్కా కాలర్‌పై మ్యాక్స్ టైలర్ కోవూరు అనే స్టికర్ ఉందన్నారు. 5.6 ఎత్తు, చామన చాయ రంగు కలిగి ఉన్నాడని గుర్తుపట్టని విధంగా మృతదేహం ఉందన్నారు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● చికిత్స పొందుతూ యువకుడు..

బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని వేంకటేశ్వరపాలెం, బిట్రగుంట రైల్వే స్టేషన్ల మధ్య ఈ నెల 19వ తేదీ రతిసార్ ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి పడి గాయపడిన కమల్ చియాన్ సింగ్ (31) నెల్లూరు జీజీహెచ్‌లొ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు కావలి రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు పట్టాలపై మహిళ మృతదేహం

కావలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై పడి ఉన్న గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం రైల్వేస్టేషన్ పాయింట్స్‌మెన్ మధుసూదన్ గుర్తించారు. ఈ విషయాన్ని స్టేషన్ మాస్టర్ ద్వారా జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న ఆధారాల పరంగా వయసు 40-45ఏళ్లు ఉంటుందన్నారు. ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని సమీపంలోని సంచిలో కూరగాయలు, కిరాణా సరుకులు ఉన్నట్లు గుర్తించారు. మృతురాలు ఎరుపు చీర, వైలెట్ కలర్ జాకెట్ ధరించి ఉందన్నారు. హెడ్ కానిస్టేబుల్ శ్యాంకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

● నడిరోడ్డుపై వాహనాన్ని నిలపడమే ప్రమాదానికి కారణం

వెంకటాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తిక్కవరప్పాడుకి చెందిన రాజేష్ ముత్తుకూరు మండలం పంటపాళెం సమీపంలోని ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి పని ముగించుకొని మోటర్ బైక్‌పై ఇంటికి వస్తుండగా తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు నడిరోడ్డుపై డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీ నిలిపివేశాడు. బైక్‌పై వస్తున్న రాజేష్‌కు చీకటిలో లారీ నిలిపి ఉన్న విషయం తెలియక ఢీకొన్నాడు. ఈప్రమాదంలో రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ప్రైవేటు అసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై రాత్రిళ్లు జోరుగా వ్యభిచారం సాగుతుంది. ఈక్రమంలో డ్రైవర్లు నడిరోడ్డుపై లారీలను నిలిపి వేస్తున్నారు.దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

రెండు బైక్‌ల ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

మర్రిపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం జరిగింది. ఈప్రమాదంలో బెడుసుపల్లి గ్రామానికి చెందిన సెంచెల నరసింహులు, పెట్రోల్ బంక్ నిర్వాహకుడు మధుబాబుకు తీవ్ర గాయాలు కాగా 108లో ఆత్మకూరుకు తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.

తెల్లరాయి తరలిస్తున్న ట్రాక్టర్ల స్వాధీనం

సైదాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తెల్లరాయి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సోమవారం ఎస్‌ఐ కాంతికుమార్ మాట్లాడుతూ అక్రమంగా తెల్లరాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో రాపూరు రోడ్డు, లింగసముద్రం రోడ్డు వద్ద తెల్లరాయి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యా వలంటీరు ఆత్మహత్యాయత్నం

● ఉపాధ్యాయుడి నుంచి కాపాడాలని తల్లిదండ్రుల వేడుకోలు

కావలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ పెకులఫ్యాక్టరీ గిరిజన కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యా వలంటీర్ సోమవారం తెల్లవారుజామున హార్పిక్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ నెల 17న స్కూల్ అని చెప్పి ఇంటి నుండి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవటంతో 18న తల్లిదండ్రులు రెండవ పట్టణ పోలీసులు ఫిర్యాదు చేశారు. అదేరోజు సాయంత్రం పోలీసులు ఆమెను వెతికి తల్లిదండ్రులకు అప్పగించారు. ఆమె ఇంటి నుంచి వెళ్లి పోవటానికి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి ప్రధాన కారణం ఆమె పనిచేస్తున్న పాఠశాలలో వివాహమైన ఉపాధ్యాయుడితో ప్రేమ పేరుతో ట్రాప్‌లో పడటమేనని తల్లిదండ్రులు తెలిపారు. ఆ ఉపాధ్యాయుడి వలన తమ కూతరు తమకు దక్కకుండా పోతుందే ఏమోనన్నభయం తమన వెంటాడుతోందని, ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుని తమ కుమార్తెను కాపాడాలని వేడుకుంటున్నారు. ఈ వ్యవహారం 1వ, 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోది కావటంతో రెండు చోట్ల పోలీసులకు ఫిర్యాదు వెళ్లింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)


ఒక గ్రాము ధర	రూ.7519
వెండి కిలో ధర	రూ. 100,400
వెండి ఒక గ్రాము	రూ.103.40

గుప్త నిధుల కోసం తవ్వకాలు

అనంతసాగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనంతసాగరం చెరువు కట్ట దిగువ అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు రెండు రోజులుగా రహస్యంగా తవ్వకాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో కొందరు స్థానికుల పాత్ర ఉన్నట్లు సమాచారం. సాగరం చెరువుకట్ట శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటిది. గతంలో చెరువు సమీపంలో పలుమార్లు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన సంఘటనలు ఉన్నాయి. తాజాగా మరలా గుప్తనిధులు తవ్వకాలు తెరపైకి రావడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.

స్పీచ్ థెరపీతో

నత్తికి చెక్!



నేడు ప్రపంచ నత్తి నివారణ అవగాహన దినం

టెక్నిక్ అమలు చేస్తే నత్తిని నయం చేయవచ్చు

పెద్ద సమస్యగా మారిన నత్తిని స్పీచ్ థెరపీతో పాటు కొన్ని చిన్న చిన్న టెక్నిక్‌ల ద్వారా నయం చేయవచ్చు. టెన్షన్ తగ్గించుకోవడం వల్ల దీన్ని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు, వంశపారంపర్యంగానే కాకుండా కూడా ఈ సమస్య వస్తోంది. చిన్నపిల్లల్లో నత్తి ఎక్కువగా ఉంటుంది. అందరితో కలిసి పోవటం పాటించడం వల్ల కూడా నత్తిని నివారించు కోవచ్చు.



– డాక్టర్ ప్రభంజన్ కుమార్ గంగా, ఈఎన్‌టీ వైద్య నిపుణులు, పద్మావతి ఆసుపత్రి

● ముందుగా గుర్తించి చికిత్స చేయిస్తే ఫలితం ● తీవ్ర ఇబ్బంది పెట్టినప్పటికీ ఇది వ్యాధి కాదు ● ఈ సమస్య చిన్నారుల్లో అధికం

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : చిన్నారులు తొలి దశలో ముద్దు ముద్దుగా పలికే మాటలు ఎంతో ముచ్చటగా ఉంటాయి. అవే మాటలు కొందరిలో పెరిగే కొద్దీ జన్యుపరమైన న్యూరో ఫిజియలాజికల్ మార్పుల వల్ల నత్తిగా మారుతాయి. దీంతో స్పష్టంగా మాట్లాడలేని పరిస్థితి ఎదురవుతోంది. కొంతమంది యుక్త వయస్సులో ఉన్నవారు కూడా పదాలు సరిగ్గా పలకలేని పరిస్థితులు లేకపోలేదు. ఈ సమస్య ఉన్న వ్యక్తి ధ్వనులను సరిగ్గా పలకడం అసలు సాధ్యం కాదు. మాటలు తడబడటం, కొన్ని అక్షరాలు సరిగా పలకలేకపోవడం, ఒక పదాన్ని పదేపదే ఉచ్చరించడం, అదే పదాన్ని వెంటనే ఉచ్చరించలేకపోవడం, ఒక్కోసారి మాట ఆగిపోయి గొంతు పెగలి బయటకు రాకపోవడం నత్తికి నిదర్శనం. దీనినే స్టామరింగ్, స్టట్టరింగ్‌లో భాగమని వైద్య నిపుణులు అంటున్నారు. ఇంత తీవ్ర ఇబ్బంది పెడుతున్న ఈ సమస్య వ్యాధి కాదని, ముందుగా గుర్తిస్తే స్పీచ్ థెరపీతో నయం చేయవచ్చని వైద్య నిపుణులు అంటున్నారు. నత్తి ఉన్న పిల్లల్లో కొందరికి వినికిడి సమస్య కూడా ఉండవచ్చు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఫ్లూయెన్సీ అసోసియేషన్, ఇంటర్‌నేషనల్ స్టట్టరింగ్ అసోసియేషన్, యురోపియన్ లీగ్ ఆఫ్ స్టట్టరింగ అసోసియేషన్ అక్టోబరు 22న నత్తి నివారణ అవగాహన దినంగా నిర్వహించాలని తీర్మానించాయి. దీనికి అనుగుణంగా జిల్లాలో ప్రతి ఏటా నత్తిపై అవగాహన కార్యక్రమాలు జరుగునున్నాయి.

స్పీచ్ థెరపీతో నయం చేయవచ్చు

ఊపిరితిత్తుల నుంచి బయటకు వచ్చే గాలి స్వరపేటికలోని స్వరతంత్రుల ప్రకంపనలతో స్వరంగా మారి బయటక వచ్చేటప్పుడు నాలుక పలు విధాలుగా కదలడం వలన అనేక శబ్దాలు ఉచ్చరించ గలుగుతాం. ఈ పక్రియ మొత్తంగా మెదడు పర్యవేక్షణలో అతివేగంగా జరుగుతూ కొన్ని సెకన్ల వ్యవధిలోనే పూర్తవుతోంది. అయితే ఈ పక్రియలో కొన్ని అసమానతలు తలెత్తినప్పుడు నత్తి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. నత్తి ఉన్న పిల్లలు మాట్లాడుతున్నపుడు వాళ్లు చెప్పేది పూర్తిగా వినాలి. పుట్టుకతో వినికిడి సమస్య ఉన్న వారికి కూడా మాటలు నత్తిగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. కొంతమందిలో భయం, టెన్షన్, ఇతరులను అనుకరించటం వల్ల, వంశపారపర్యంగా నత్తి వస్తోంది. ఈ పరిస్థితిలో చిన్న పిల్లలు నత్తినత్తిగి మాట్లాడటం ఒక సాధారణ సమస్యగా మారుతోంది. దీనిని వయస్సును బట్టి స్పీచ్ థెరపీ శిక్షణ ద్వారా సాధారణంగా మాట్లాడేలా చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

బాలురలో నాలుగు రెట్లు ఎక్కువ

నత్తి సమస్య బాలికల కంటే బాలురలో నాలుగు రెట్లు అధికంగా ఉన్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. ఐదేళ్ల లోపు పిల్లల్లో 65 శాతం మందిలో, యుక్త వయస్సులో 75 శాతం మందికి ఈ సమస్య ఉంది. రెండు నుంచి 7 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లల్లో నత్తి అధికంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆకస్మికంగా నత్తిగా మాట్లాడే వారిలో ఈ సమస్య కొంత కాలం మాత్రమే ఉంటుంది. నత్తి వల్ల శారీరకంగ ఎలాంటి సమస్యలూ ఉండవని వైద్యులు చెబుతున్నారు. పిల్లల మానసిక స్థితిని సరిగ్గా అర్థం చేసుకోకుండా ఇతరులతో పోల్చి చూడటం, ఎగతాళి చేయడం వంటి చర్యలవల్ల ఈ సమస్య మరింత పెరగవచ్చని పలు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

ఫిర్యాదులపై స్పందించండి

నెల్లూరు (క్రైం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అధికారులను ఆదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 91 మంది సమస్యలను విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరం పరిష్కరించాలి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి వస్తున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, సర్వే పంచాయితీ శాఖలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. ఒకే సమస్యల పై పదే పదే రాకుండా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. సోమవారం 375 అర్జీలు వచ్చాయన్నారు.



కలెక్టరుకు సమస్యను వివరిస్తున్న యానాదుల సంక్షేమ సంఘం నాయకులు

● గురుకులంలో కనీస వసతులు లేవు

కొడవలూరు మండలం చంద్రశేఖరపురం గురుకుల పాఠశాలలో కనీస వసతులు లేవని యానాదుల సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు ఉష, నగరాధ్యక్షురాలు వరలక్ష్మి, రాష్ట్ర నాయకులు సతీష్ తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భోజనం సరిగా పెట్టడం లేదని, వసతి గృహంలో లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని, మరుగుదొడ్లు కూడా సరిగా లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ తానే స్వయంగా పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

● అట్రాసిటీ కమిటీ సమావేశం నిర్వహించాలి

జిల్లా అట్రాసిటీ, విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని ఆ కమిటీ సభ్యులు ఉల్లిపాయల మురళీకృష్ణ జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన సమావేశం జరగడం లేదన్నారు. జిల్లాలో అనేక ఎస్సీ, ఎస్టీ సమస్యలు ఉన్నాయని, సంక్షేమ వసతి గృహాల్లో అధికారుల పనితీరు ఘోరంగా ఉందని ఆయన దృష్టికి తెచ్చారు.

సచివాలయాలను పంచాయతీలకు

అనుసంధానం చేయాలి

● పంచాయతీ సర్పంచుల సంఘం డిమాండ్

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాలను పంచాయతీలకు అనుసంధానం చేయాలని సర్పంచుల సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కే.శివకుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేక గందరగోళంగా తయారైందన్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో 1 నుంచి 5 సచివాలయాలు ఉన్నాయని, అలాకాకుండా ప్రతి పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఆ ఉద్యోగులను పంచాయతీకి అనుసంధానం చేయాలని కోరారు. దీనిపై గత ప్రభుత్వంలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సర్పంచుల విన్నపాన్ని సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేష్‌యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి నాగేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచుల సంఘం నాయకులు

నెల్లూరు కార్పొరేషన్ ఏడీసీగా నందన్

● శర్మద మంగళగిరికి బదిలీ

నెల్లూరు(సిటీ), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ అదనపు కమిషనర్ (ఏడీసీ)గా వైవో నందన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘల్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. మంగళగిరిలోని పురపాలక శాఖ రాష్ట్ర కార్యాలయంలో డీడీగా పని చేస్తున్న ఆయనను నెల్లూరుకు బదిలీ చేసి ఎన్ఎంసీలో ఏడీసీగా ఉన్న శర్మదను మంగళగిరి కార్యాలయానికి బదిలీ చేశారు. కాగా 2021లో నెల్లూరు కార్పొరేషన్ ఏడీసీగా నందన్ పనిచేసి ఉన్నారు. మంగళవారం ఆయన బాధ్యతలు తీసుకుంటారని కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.



నందన్

టీడీపీ సభ్యత్వం పొందితే రూ.5 లక్షల బీమా

● ఆత్మకూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేసి చూపిస్తా : మంత్రి ఆనం

ఆత్మకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతిఒక్కరికీ రూ. 5 లక్షల బీమా సౌకర్యం పార్టీ కల్పిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు పట్టణ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా టీడీపీ నాయకులు తాళ్లూరి గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి సభ్యత్వానికి లక్ష రూపాయలు వంతున చెల్లించగా వారికి టీడీపీ జీవితకాల శాశ్వత సభ్యత్వాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు మున్సిపాల్టీ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. పట్టణంలో ఎల్‌ఈడి లైట్లు, అన్నివార్డుల్లో సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడతామన్నారు. ఆత్మకూరు సమీపంలోని టిడ్కో ఇళ్లలో అన్ని సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అన్ని వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఎవరైనా పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చూపితే వెంటనే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. తహసీల్దారు కార్యాలయం పూర్తికావచ్చిందని, బీసీ బాలికల రెసిడెన్షియల్ కళాశాల, ఆర్అండ్‌బి అతిథిగృహాలను ఆయా శాఖల మంత్రులతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. పట్టణంలోని రోడ్లు, పార్కుల అభివృద్ధి, ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాస్, సభ్యత్వ నమోదు పరిశీలకుడు కార్తీక్, టీడీపీ నాయకులు బొల్లినేని గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పలువురు ఆత్మకూరు పట్టణ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

శివాలయంలో హుండీ చోరీకి యత్నం

మర్రిపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నందవరం శివాలయంలో ఆదివారం రాత్రి దుండగులు దొంగతానికి ప్రయత్నించారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శ్రీనివాసురావు స్థలాన్ని పరిశీలించారు.



సమాజ శ్రేయస్సే పోలీసుల లక్ష్యం

- పోలీసు అమరవీరుల ఘన నివాళి
- విద్యార్థులతో కలిసి ర్యాలీలు
- అమరుల త్యాగాలు స్మరించుకుంటూ జోహార్లు



ఆత్మకూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్



కావలి: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కావలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు సోమవారం పోలీసులు విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ట్రంకురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. పొట్టిశ్రీరాములు విగ్రహం సెంటర్‌లో మానవహారం నిర్వహించి పోలీస్ అమరవీరులకు నివాళులుగా కొంత సేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో రూరల్, వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు రాజేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, శ్రీనివాసరావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

● కొండాపురం: మండలకేంద్రంలో ఎస్‌ఐ ఎమ్.వెంకటరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదర్శపాఠశాల వద్ద నుండి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు.

● జలదంకి: మండల ఎస్‌ఐ లతీఫున్నీసా ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బస్టాండు కూడలి నుండి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. శ్రీసాయి విద్యాసంస్థల అధినేత అయ్యలరెడ్డి ఎస్‌ఐ లతీఫున్నీసాను సన్మానించారు.

● బిట్రగుంట: సమాజ శ్రేయస్సు కోసం పని చేయడమే పోలీసుల లక్ష్యమని స్థానిక ఎస్‌ఐ భోజ్యా అన్నారు. మండలకేంద్రంలోని ఎస్‌ఆర్‌కే ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విశ్వనాథరావుపేట నుంచి బోగోలు బజారు కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది.

● ఉలవపాడు:రామాయపట్నం మెరైన్ పోలీసులు సీఐ శివన్నారాయణ ఆ ధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామాయపట్నం మెరైన్ ఎస్సైలు ఎస్‌కే షరీఫ్, పీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

● సంగం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్‌లు చేపట్టిన ర్యాలీని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి పోలీసు అమర వీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు మరువలేనివని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● దుత్తలూరులో: సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి ఎస్‌ఐ ఆదిలక్ష్మీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 565 జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఆత్మకూరు: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ వేణుగోపాల్, సీఐ గంగాధర్ పేర్కొన్నారు. ఆత్మకూరులో పోలీసులు స్థానిక స్టేషన్ నుంచి విద్యార్థులతో కలిసి పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు షేక్ జిలాని, సాయి ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఏఎస్ పేట: ఎస్‌ఐ సైదులు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ నుండి బస్టాండ్ సెంటర్, నగారా ఖానా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

● వరికుంటపాడు: ఎస్‌ఐ రఘునాథ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు, నాయకులు ఉన్నత పాఠశాల నుంచి జాతీయ రహదారి మీదుగా నినాదాలు చేస్తూ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానహారం ఏర్పాటుచేసి అమరులైన పోలీసులకు నివాళులర్పించారు.

● వింజమూరు: ఎస్‌ఐ వీరప్రతాప్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, సుభాన్, మాధవ, పద్మారెడ్డి పాల్గొన్నారు.

● కలువాయి: స్థానిక బస్టాండు సెంటర్‌లో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద రాపూరు సీఐ విజయకృష్ణ, ఎస్‌ఐ సుమన్, సిబ్బందితో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శేష గిరి రావు, వైద్యులు రాజేష్, హెచ్‌ఎం. అబ్బాస్ అలీ, పెంచలరావు, నాగేశ్వరావు ఉన్నారు.

● సీతారామపురం: ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వరకు నిర్వహించారు.

రైతులను ఆదుకుంటాం

● ఉదయగిరి సబ్ డివిజన్ ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకుడు పీ.చెన్నారెడ్డి



ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ఉదయగిరి సబ్ డివిజన్ ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకుడు పీ.చెన్నారెడ్డి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ..

ముఖాముఖి

? సబ్ డివిజన్‌లో వర్షాలకు ఏ ఏ పంటలు దెబ్బతిన్నాయి

! ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సీతారామపురం మండలంలో పూత, కోత దశలో ఉన్న వరి పంటకు అధికంగా నష్టం చేకూరింది. సుమారు 20 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది.

? రైతులకు పరిహారం ఎలా అందిస్తారు

! ఈ-కేవైసీ చేయించుకున్న ప్రతి రైతుకు ప్రభుత్వ పరంగా పంట నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

? నకిలీ విత్తనాల బెడద ఉంది కదా

! నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తాం. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. ఒకవేళ పంట నష్టపోతే అలాంటి రైతులకు పరిహారం అందేలా చూస్తాం.

? సబ్సిడీపై టార్పాలిన్ పట్టలు ఎప్పుడు ఇస్తారు

! ఐదేళ్లుగా రాయితీపై టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు పంటను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాబోయే రోజుల్లో ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై పట్టలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతోంది.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

సీతారామపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే పల్లె పండుగ కార్యక్రమం లక్ష్యం అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం సీతారామపురం పంచాయతీలో బెస్తకాలనీ, తోటకాలనీ, బీసీ కాలనీ, ఏనుగులవారికొట్టాలు, బసినేనిపల్లి పంచాయతీలో సంజీవరెడ్డినగర్, గుండుపల్లి పంచాయతీలలో ఎస్టీ కాలనీలలో రూ. 2 కోట్ల 37లక్షలతో నిర్మించే అంతర్గత సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కాకర్ల శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బోగినేని కాశీరావు, మండల టీడీపీ కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి, తురక వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కావలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కావలి ఎమ్మెల్యేదగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలో 46 మంది లబ్ధిదారులకు రూ.13.8లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పమిడి రవికుమార్ చౌదరి, బీద గిరిధర్, గుత్తికొండ క్రిషోర్ బాబు, జ్యోతి బాబూరావు, మాలేపాటి నాగేశ్వరరావు, ఆవుల రామకృష్ణ, కండ్లగుంట మధుబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

న్యూస్ బాక్స్

విద్యార్థి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి గుమ్మళ్ల దశరథ ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని తల్లి రాజేశ్వరి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల మేరకు.. ఉదయగిరిలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న రాజేశ్వరి ఆదివారం మధ్యాహ్నం భోజనానికి వెళుతూ కుమారుడిని దుకాణంలో ఉంచి వెళ్లింది. తిరిగి దుకాణానికి వచ్చిన రాజేశ్వరికి కుమారుడు, దుకాణంలో రూ.9 వేల నగదు కూడా కనిపించలేదు. దీంతో రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కాగా, దశరథ ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు.



ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

● సీపీఎం, ప్రజాసంఘాల ఆందోళన

ఉదయగిరి రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని సోమవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్‌రోడ్డు కోతకు గురై వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, దశాబ్దాల కాలం నుంచి రోడ్డునిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో సుమారు 12 కొండకింద గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అన్నంపల్లి వద్ద దున్నపోతుల వాగుపై నిర్మించిన వంతెన పూర్తిగా దెబ్బతినడంతో కొండకింద గ్రామాలకు బస్సులు రాక ప్రజలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుజ్జుల మల్లికార్జున, లక్ష్మీనారాయణ, కోడె రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

జైకా నిధులతో చెరువులకు మరమ్మతులు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) నిధులతో ఉదయగిరి సబ్ డివిజన్‌లోని పలు గ్రామాల చెరువులకు మరమ్మతులు చేపడుతున్నట్లు జలవనరుల శాఖ డీఈ కె చంద్రమౌళి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఉదయగిరి చిన్న, పెద్ద చెరువుల మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. ఇప్పటికే పలు చెరువులకు సంబంధించి పనులు కొనసాగుతున్నాయన్నారు.



66వ సారి రక్తదానం

కావలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్, రామాయపట్నం పోర్టు సాధన కమిటీ కన్వీనర్ కండ్లగుంట మధుబాబు నాయుడు సోమవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో 66వ సారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కన్వీనర్ రవిప్రకాష్, రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ హరినారపరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తూర్పు రాజగోపుర ద్వారబంధ ప్రతిష్ఠ

బిట్రగుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రంలో సోమవారం తూర్పు రాజగోపుర ద్వార బంధ ప్రతిష్ఠాపన కార్యక్రమంను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఈపూరి సత్యనారాణ చార్యులు ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాజగోపుర నిర్మాణ దాతలు మన్నెమాల సుకుమార్‌రెడ్డి దంపతులు, మాజీ సర్పంచు పొడమేకల మాల్యాద్రి, కర్తం సురేంద్రరెడ్డి, మాధవరెడ్డి, ఓబుల్‌రెడ్డి, గండూరి శ్రీనివాసులు, ఎస్.వేంకటేశ్వర్లు రెడ్డి, కావలి నేతలు ఉన్నారు.

ఇంటూరికి బెస్ట్ ఇండియన్ ఆర్టిస్ట్ అవార్డు

కందుకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంకు చెందిన విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి, సినీ నటుడు ఇంటూరి మల్లికార్జునరావుకు బెస్ట్ ఇండియన్ ఆర్టిస్టు అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభార తిలో ఆదివారం రాత్రి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ఇచ్చారు.

హైవే పనుల పరిశీలన

వలేటివారిపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సింగరాయికొండ నుండి నెల్లూరు జిల్లా మాలకొండ వరకు జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను సోమవారం మాలకొండలో బీజేపీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ మూడు లైన్‌లు నిర్మాణ పనులను నాలుగులైన్‌ల రహదారిగా మార్చాలని, కందుకూరు నుండి మాచవరం వెళ్లే రహదారిలో ఎర్రవాగు దగ్గర అండర్ బైపాస్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కందుకూరు పార్టీ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నాదుల రాఘవులు, కొమ్మి నరసింగరావు, తోగంటి శ్రీనివాసులు, ఉన్నం సింహాద్రి పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

ఏఎస్ పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజవోలులోని గ్యార్మీ ఏ షరీఫ్ మహబూబ్ సుభాహని దర్గా గంధ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ జెండాకు గ్రామోత్సవం చేశారు.

రహదారులు సరే.. మురుగు కాలువలేవీ?

వెంకటాచలం, అక్టోబరు 21 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో వివిధ పథకాల కింద సిమెంటు రోడ్లను నిర్మించాయి. అయితే మురుగు నీటిపారుదల విషయాన్ని మాత్రం అవి పరిగణలోకి తీసుకోలేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మండలంలోని గ్రామాల్లోని అన్ని వీధులకు సిమెంటు రోడ్లు నిర్మించడానికి గత టీడీపీ ప్రభుత్వం రూర్బన్, ఉపాధి హామీ నిధులను మంజూరు చేసింది. దీంతో వాడవాడలా సిమెంటు రోడ్లను నిర్మించారు. కానీ సైడ్ కాలువలను నిర్మించేలోపే ప్రభుత్వం మారింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సైడ్ కాలువల నిర్మాణాన్ని విస్మరించారు. వర్షా కాలంలో నీటి పారుదల, మురుగు నీటి పారుదల వసతి గురించి అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. దీంతో కొన్ని గ్రామాలు నిత్యం మురికి కూపాలుగా మారాయి. అంతేకాక దుర్గంధం కూడా వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిమెంట్ రోడ్లు నిర్మించిన గ్రామాల్లో సైడ్ కాలువలను నిర్మించాల్సి ఉంది.



మురుగునీటి కాలువలు లేకుండా కంటేపల్లిలో నిర్మించిన బీటీ రోడ్డు

కామాక్షిదేవికి సోమిరెడ్డి పూజలు

మనుబోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెవోలులో శ్రీకామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన సతీమణి జ్యోతి, కుమారుడు రాజగోపాల్‌రెడ్డి హాజరై స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు. ప్రత్యేకపూజలు చేయించారు. ప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. తరువాత ఆది దంపతులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, ఎస్ సురేంద్రరెడ్డి, నిఖిల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సీహెచ్ పట్టాభిరామిరెడ్డి, ఆర్ కిరణ్‌కుమార్, డీ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.



పూజల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

వైభవంగా చెన్నకేశవుడి కల్యాణం

తోటపల్లిగూడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల నుంచి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



కల్యాణోత్సవంలో స్వామి వారి ఉత్సవ మూర్తులు

మానసిక అభివృద్ధికి క్రీడలు దోహదం

వెంకటాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక అభివృద్ధికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం క్రీడీ పోటీల్లో విజేతలుగా నిలిచిన యూనివర్సిటీ క్రీడాకారులు హేమంజనేయులు, శ్రీనివాసరావులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల, టీమ్ వర్క్ వంటి విలువలు చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, వర్సిటీ కళాశాల పీడీ డాక్టర్ పీ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళి

రాపూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అమరవీరులకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం రాపూరు పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం వెంకటరాజేష్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు రాపూరు మండల సమావేశం

రాపూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 23న సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎండీవో భవానీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి మండల ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచులు, అధికారులు హాజరవుతారని ఎండీవో తెలిపారు.

మృతుడి కుంటుంబానికి ఆర్థిక సాయం

సైదాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగనరామాపురంలో అనారోగ్యంతో మృతిచెందిన బొమ్మిశెట్టి నరసయ్య కుంటుంబానికి సోమవారం బలిజ చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.7వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా మండల బలిజ సంఘం సభ్యుడు చింతలపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ పేదరికంలో ఉంటూ అనారోగ్యంతో మృతిచెందిన నరసయ్య మట్టి ఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు.

లక్ష దీపోత్సవానికి అంకురార్పణ

● భూమిపూజ చేసిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీఆర్సీ మైదానంలో నవంబరు 8, 9, 10వ తేదీల్లో కార్తీక మాస లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సోమవారం వీఆర్‌సీ మైదానంలో అంకురార్పణ జరిగింది. కోవూరు ఎమ్మెల్యే, వీపీఆర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు కంజర్ల భాస్కర్‌శర్మ, విజయసారధి, సునీల్‌కుమార్, అర్చకుడు పవన్‌స్వామితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం గుంజ ప్రతిష్ఠాపన జరిగింది. కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమం ప్రతి ఏటా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు.



వీఆర్సీ మైదానంలో అంకురార్పణ పూజలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, తదితరులు

ఈ కార్యక్రమంలో నాగేంద్రకుమార్, తిరుపాల్‌రెడ్డి, రాము, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చలమయ్యతోపాటు పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయకులకు డీఆర్‌సీలో శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సబ్ డివిజన్ పరిధిలోని నెల్లూరు రూరల్, వెంకటాచలం, సైదాపురం మండలాల్లోని రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు (వీఏఏ)కు నెల్లూరు జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ)లో సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. సీఎల్ఎస్-పీడీఎస్ఎస్ యాప్‌పై అవగాహన, పంటలు, పోషకాల లోపం, పురుగులు, తెగుళ్ల గుర్తించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, రబీ సీజన్‌కు అనువైన వివిధ రకాల విత్తనాలు, కాలపరిమితి, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కలుపు, ఎరువుల యాజమాన్యం, బ్యాంకుల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీ మారుతీదేవి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు శ్రీలక్ష్మి, వినీత, పరమశివ, లీడ్ బ్యాంకు కోఆర్డినేటర్ రవిశంకర్, ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'చింతారెడ్డిపాళెం'కు సురక్షిత నీరు అందించండి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్‌లోని 12వ డివిజన్ చింతారెడ్డిపాళెం ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజను కోరారు. సోమవారం కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో స్థానికులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతారెడ్డిపాళెంలో నీటి సరఫరా ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని, కుళాయిల్లో రంగు నీరు వస్తుందని చెప్పారు. ఉన్న రెండు బోర్లు పూర్తిగా పాడయ్యాయని, వీటికి మరమ్మతులు చేసి మరో రెండు కొత్త బోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. 33వ డివిజన్‌లోని ఎన్ఎంసీ పాఠశాలలో వాచ్‌మన్‌ను నియమించాలని కోరారు. అలాగే వైసీపీ నేత చంద్రశేఖర్‌రెడ్డి కమిషనర్‌కు వినతిపత్రం అందచేసి 13వ డివిజన్ హెచ్‌పీ గోదాము వద్ద పార్కు స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని, వెంటనే కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తాను నివాసముంటున్న మాగుంట లేఅవుట్ ప్రాంతంలోని స్థానిక సమస్యలు పరిష్కరించాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు కమిషనర్‌ను కోరారు. అనంతరం నగర వాసులు, పలు ప్రజా సంఘాల నాయకులు వినతులు అందించారు.



కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న గిరిధర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● కోవూరు మండల సభలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గృహ నిర్మాణశాఖాధికారులు పక్కా గృహాల నిర్మాణ విషయంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. పక్కాగృహాల్ని నిర్మించే కాంట్రాక్టర్లతో మాట్లాడి వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. గృహనిర్మాణశాఖాధికారులు పనితీరును మార్చుకోవాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నీటిపారుదలశాఖాధికారులు కాలువల్లో పూడిక తీయించేందుకు కృషిచేయాలన్నారు. ఊటుకూరు రోడ్డులో ఇనమడుగు, లేగుంటపాడు గ్రామాల్లో విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చెట్లను కూల్చివేయడంపై సర్పంచు జెట్టి రాజగోపాలరెడ్డి అధికారులను నిలదీశారు. వాల్టా చట్టం కింద అధికారులపై పోలీసు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి అధ్యక్షత వహించిన సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీహరిరెడ్డితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● **కేన్సర్ రహిత కోవూరే లక్ష్యం**

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గాన్ని కేన్సర్ రహిత నియోజకవర్గంగా చేయాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుచ్చి ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో సోమవారం కేన్సర్ రోగులకు నిర్వహించిన పరీక్షలను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకర్గ ప్రజలకు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించేందుకు మళ్లీ, మళ్లీ బస్సును తీసుకువస్తామని తెలిపారు. కాగా నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3600మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం పలు ప్రజాసమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించారు.

● **అనువైన స్థలం చూడండి**

అనంతరం బుచ్చిలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు పలు ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆలస్యమైనా అనువైన ప్రాంతాన్ని చూస్తే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పద్మజ, డాక్టర్ అహ్మద్ బాబు, డాక్టర్ వినయ్, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి, నాయకులు శివరామకృష్ణారెడ్డి, హరికృష్ణ, ఎంపీ.శేషయ్య బీజేపీ. జనసేన, నాయకులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రపంచలోని అన్ని కేన్సర్‌ల కన్నా రొమ్ము కేన్సర్ బాధితులు ఎక్కువమంది ఉన్నారని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రిలో రొమ్ము కేన్సర్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో 40 ఏళ్ల పైబడిన వారికి వచ్చే రొమ్ము కేన్సర్ ప్రస్తుతం చిన్న వయసులోనే వస్తుందన్నారు. మగవారిలో కూడా రొమ్ము కేన్సర్ చూస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చీఫ్ మెడికల్ అఫీసర్ డాక్టర్ లక్ష్మి, రేడియాలజీ అంకాలజిస్ట్ డాక్టర్ గీతాఉషశ్రీ, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ హేమంత్, రేడియాలజిస్ట్ డాక్టర్ హరిత, పెథాలజిస్ట్ డాక్టర్ నందిత, కౌన్సిలర్ కన్యాకుమారి, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంట కాలువల్లో నిండిపోయిన గుర్రపుడెక్కను ప్రభుత్వం వెంటనే తొలగింప చేయాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. నగరంలోని జాఫర్ సాహెబ్, సోమశిల కాలువలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీరు విడుదల చేసిన తర్వాత గుర్రపుడెక్క తొలగించే పనులకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితులు ఉండవని, జాఫర్ సాహెబ్ కెనాల్, సర్వేపల్లి కాలువ, కృష్ణాపట్నం కాలువ, వల్లూరు, కనుపూరు కాలువలు, సదరన్ ఛానల్, ఈ స్ట్రాన్ ఛానల్‌లలో పూడిక తీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు.

బీజేపీ మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పిలుపు నిచ్చారు. బాలాజీనగర్‌లో జరుగుతున్న సీపీఎం నగర 25వ మహాసభలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నగరంలో సీపీఎం శ్రేణులు పూలే బొమ్మ నుంచి మసీదుసెంటర్, లక్ష్మీబోర్డు సెంటర్ మీదుగా భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రమేష్ మాట్లాడుతూ బీజేపీకి జనసేన వత్తాసు పలుకగా టీడీపీ మౌనం వహించటం విచారకరమన్నారు. నిరుద్యోగం, అధికధరలు, కరెంటు చార్జీల భారాలు ఇలా అనేక సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటే పట్టించుకోకుండా మత విశ్వాసాలను రెచ్చగొట్టి రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కృష్ణపట్నం టెర్మినల్ మూసివేయడం వల్ల 10వేల మందికి ఉపాధి పోయిందన్నారు. అనంతరం 21 మందితో నెల్లూరు నగర కమిటీని నియమించారు.నగర కార్యదర్శిగా మళ్లీ కత్తి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌బీ, సూర్యనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉండే వైద్యులు సమయపాలన పాటించాలని ప్రభుత్వం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్ ఆదేశించారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో అన్ని వైద్య విభాగాల హెచ్‌వోడీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వైద్యుడు ఎఫ్ఆర్ఎస్ ప్రకారం హాజరు కావాలన్నారు. అవసరమైతే తప్ప వైద్యులు సెలవులపై వెళ్లరాదని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ మాట్లాడుతూ రోగులకు ఇబ్బంది లేకుండా సీనియర్ వైద్యులు ఓపీలో పూర్తి సమయం ఉండాలని సూచించారు. త్వరలోనూ ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) కమిటీ వైద్య కళాశాల, సర్వజన ఆసుపత్రి తనిఖీకి వస్తారన్నారు. ఈ లోపు వైద్యులు తమ పరిధిలోని రోగులకు అందించిన వైద్య సేవలు, ఆపరేషన్లు వంటి వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు. సేవలతో పాటు ఓపీ సేవలు పెరిగితే వైద్య కళాశాలకు పీజీ సీట్లు వస్తాయని అప్పుడు రోగులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు వీలు ఉంటుందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

నెల్లూరు అభివృద్ధికి 'హడ్కో' చేయూత

నెల్లూరు(సిటీ), అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు అభివృద్ధి పనులకు హడ్కో నుంచి ఆర్థిక చేయూత అందనుంది. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో హడ్కో అధికారులతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నిర్వహించిన సమీక్షలో పలు కీలక అంశాలు చర్చకొచ్చి అంగీకారమయ్యాయని నారాయణ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. 2014-19 సంవత్సరాల్లో అధికారంలో ఉన్న టీడీపీ నెల్లూరులోని ప్రజల సౌకర్యార్థం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా పథకాలు దాదాపుగా 80 శాతం పూర్తయ్యాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ వీటిని పూర్తిగా పక్కన పెట్టేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేతృత్వంలోని మంత్రి నారాయణ వాటిని పూర్తి చేసేందుకు సిద్ధమయ్యారు.

ఇందులో భాగంగా హడ్కో సమీక్షలో యూజీడీ, తాగునీటి పనులు పూర్తి చేసేందుకు రూ.165 కోట్లు హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు అంగీకారం కుదిరినట్లు ఆయన కార్యాలయం తెలిపింది. నెల్లూరులో రూ. 995 కోట్లతో ఈ రెండు పనులను మొదలుపెట్టిన అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.830 కోట్ల వరకు ఖర్చు చేసింది. రూ.165 కోట్ల పనులు మిగిలిపోవడంతో వాటిని తాజాగా హడ్కో ఇచ్చేందుకు అంగీకరించడంతో అవి పూర్తయ్యేందుకు కసరత్తు మొదలుకానుంది.

రాజరాజేశ్వరికి దసరా ఆదాయం రూ.93.77 లక్షలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : నగనంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.93,77,164 ఆదాయం వచ్చిందని జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023లో రూ.79,05,873 వచ్చిందని, గత ఏడాదికన్నా ఈ ఏడాది రూ.14,71,291 అధికంగా వచ్చిందని తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలకు ప్రతీ రోజు 25 నుంచి 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. ఉత్సవాలకు సంపూర్ణ సహకారం అందించిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఉత్సవ కమిటీ చైర్మన్ ఆళహరి విజయకుమార్, సభ్యులు లక్ష్మీయాదవ్, అంకేష్, కేవీ.రాఘవేంద్రరావు, ఆర్‌వీ.రమణకుమార్, సీవీ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పవిత్రోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఉదయం తిరుమంజనం, హోమం, పూర్ణాహుతి, పవిత్రం సమర్పణలు జరిగాయి. సాయంత్రం అగ్రహారోత్సవం, పూర్ణాహుతి, పూజలు జరిగాయి. ఈ కార్యక్రమాలను చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈవో సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



స్వామివారికి తిరుమంజనం సేవలు

న్యూస్ బాక్స్

వైద్యశాలను పునఃప్రారంభించాలి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పాత మున్సిపల్ వైద్యశాల వద్ద ఉన్న గోషా వైద్యశాల (మెటర్నిటీ వైద్యశాల)ను పునఃప్రారంభించాలని కోరుతూ ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ జియా ఉల్ హక్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. ప్రసవాలకు సంబంధించిన ఈ వైద్యశాల నిర్మాణం పూర్తయినా దీనిని ప్రారంభించకపోవటం హాస్యాస్పదమన్నారు. ఈ వైద్యశాలను వెంటనే ప్రారంభించాలని కోరారు.

నగరంలో మళ్లీ వర్షం

నెల్లూరు(సిటీ), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం నుంచి కాస్త తేరుకునే లోపు మళ్లీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో వాన పడుతూనే ఉంది. కొన్ని చోట్ల చిరుజల్లులు పడగా, మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే తడిచి ముద్దైన నగరంకు తాజాగా చినుకులు తోడవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పలేదు. స్కూటర్లు, పాదాచారులు ఇక్కట్లుపడ్డారు.

రేపు రూరల్ మండల మీట్

నెల్లూరురూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శైలేంద్రకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తమ కార్యాలయంలో ఎంపీపీ విజయకుమార్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష ఉంటుందని తెలిపారు.

భూ ఆక్రమణపై చర్యలు తీసుకోండి

మనుబోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ జట్లకొండూరు వాసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచు ఆవుల తులసీరామ్ యాదవ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీలోని శ్మశానాలు,చెరువులు, రోడ్లు ఆక్రమించి నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. అనంతరం డీటీ బషీర్‌కు, పోలీసులకు వినతిపత్రాలు ఇచ్చారు.

ఎమ్మార్పీకే ఎరువులు అమ్మాలి

మనుబోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీకే ఎరువులు, పురుగుమందులను విక్రయించాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పలుగ్రామాల్లో ఉన్న ఎరువుల, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న స్టాకును, రికార్డులలోని వివరాలను పరిశీలించారు. మనుబోలులో కొత్తగా ఏర్పాటైన ఇందిరా సీడ్స్ దుకాణాన్ని తనిఖీచేసి నాణ్యమైన విత్తనాలనే రైతులకు అందించాలని, మద్దతుధరకే ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జహీర్ పాల్గొన్నారు.

భూ పరిహారం చెక్కు అందజేత



పరిహారం చెక్కు అందజేస్తున్న నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ఓబులవారిపల్లి- కృష్ణపట్నం రైల్వే లైనుకు సేకరించిన భూమికి సంబంధించిన పరిహారం చెక్కును నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష సోమవారం అందజేశారు. తన కార్యాలయంలో వెంకటాచలం మండలం కనుపూరుకు చెందిన బాధితురాలు రాధాకు 200 చదరపు గజాలకు గాను రూ.7,52,077 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వం అవసరాలకు భూములను అందించిన వారికి త్వరగా పరిహారం అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పెంచలోరి సేవలో ఉషమ్మ

రాపూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామిని పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సతీమణి ఉషమ్మ సోమవారం దర్శించుకున్నారు. వేద పండితులు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పత్రికాస్వేచ్ఛను కాలరాస్తున్న ప్రభుత్వం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతికా స్వేచ్ఛను ప్రభుత్వం కాలరాస్తుందంటూ ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు ధర్నా చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. ఓ పత్రికా ఎడిటర్‌పై అక్రమంగా పెట్టిన కేసును వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లుతో పాటు పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	97036 16724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	99890 59755

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు



భారీ వర్షాలతో గత వారం పీజీ ఆర్ఎస్ రద్దయింది. దీంతో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి అర్జీదారులు భారీగా తరలివచ్చారు. సమస్యలపై వినతి పత్రాలిచ్చారు.

6లో

అమ్మ.. నాన్న.. తిరుమలా..!



స్వామితో గొప్ప అనుబంధం నాది అంటున్న దర్శకుడు శ్రీను వైట్ల

6లో

కారులో మంటలు

● ప్రయాణికులు క్షేమం

చంద్రగిరి మండలం తొండవాడ వద్ద ఆదివారం రాత్రి ఆకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు అప్రమత్తమై కారు దిగిపోయారు. కారు పూర్తిగా కాలిపోయింది. రాజమహేంద్రవరానికి చెందిన ఐదుగురు భక్తులు వేలూరు సమీపంలో గోల్డెన్ టెంపుల్ దర్శనానికి వెళ్లి కారులో తిరిగి తిరుపతికి వస్తున్నారు. తొండవాడ వద్దకు రాగానే ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన భక్తులు కారు దిగి పరుగులు తీశారు. ఆ వెంటనే కారులో మంటలు వ్యాపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అప్పటికే కారు దగ్ధమైంది. భక్తులు వెంటనే దిగిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



కోట బీసీ బాలుర హాస్టల్‌లో విరిగిన కిటికీ రెక్కలు

సంక్షేమ హాస్టళ్లు.. సంక్షోభంగా మారాయి. పైకప్పులన్నీ పెచ్చులూడిపోయి కుంగిపోయి.. ఓ క్షణాన్నైనా కూలిపోయేలా కనిపిస్తున్నాయి. తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేక దుర్వాసన వస్తున్నాయి. పలు హాస్టళ్లలో విద్యార్థులకు బెడ్‌షీట్లు పంపిణీ చేయకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకుని వాడుకుంటున్నారు. ఇన్ని దురవస్థల నేపథ్యంలో మెజారిటీ హాస్టళ్లలో విద్యార్థుల హాజరు శాతం దారుణంగా పడిపోయింది. సోమవారం రాత్రి జిల్లావ్యాప్తంగా ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ సంక్షేమ హాస్టళ్లను సందర్శించిన సందర్భంలో ఈ చేదు వాస్తవాలు వెలుగు చూశాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వాకాడు బీసీ బాలుర హాస్టల్ గదిలో కిటికీలు ఊడిపోవడంతో థెర్మోకోల్ అడ్డుగా పెట్టి టేపు వేశారిలా.. - బాలాయపల్లి మండలం వెంగమాంబపురం బీసీ బాలుర హాస్టల్‌లో విరిగిన కిటికీ తలుపులు



చిట్టమూరు బీసీ బాలుర హాస్టల్‌లో విరిగిన తలుపులు

హాజరు శాతం దారుణం

- కేవీబీపురం ఎస్సీ బాలుర హాస్టల్‌లో 70 మంది పిల్లలు వుండాల్సి వుండగా సోమవారం రాత్రి 8 గంటల సమయంలో సందర్శిస్తే సగం మందే వున్నారు.
- బీఎన్ కండ్రిగ ఎస్సీ బాలుర హాస్టల్‌లో 66 మందికి గానూ 20 మంది.. బీసీ బీసీ బాలుర హాస్టల్‌లో 115 మందికి 70 మంది.. ఎస్సీ బాలికల హాస్టల్‌లో 113 మందికి 50 మంది ఉన్నారు.
- దక్కిలి బీసీ బాలుర హాస్టల్‌లో 17 మందికి గానూ 10 మందే వున్నారు.
- కోట బీసీ బాలుర హాస్టల్‌లో 98 మందికి గానూ 48 మందే వున్నారు.
- ఓజిలి బీసీ బాలుర హాస్టల్‌లో 40 మందికి గానూ సోమవారం 25 మంది హాజరైనట్లు రిజిస్టర్‌లో నమోదు చేశారు. కానీ, రాత్రి 8 గంటల సమయంలో సందర్శించినప్పుడు 19 మంది మాత్రమే ఉన్నారు.

సంక్షోభ హాస్టళ్లు!

- పెచ్చులూడుతున్న పైకప్పులు
- ఉరుస్తున్న గదులు
- బీటలు వారుతున్న గోడలు
- విరిగిన తలుపులు.. రెక్కలు లేని కిటికీలు
- ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైన చేదు వాస్తవాలు

ఏర్పేడులో కనీస వసతులేవ్

ఏర్పేడు బీసీ బాలుర హాస్టల్లో పిల్లలకు కనీస సదుపాయాలు లేవు. బెడ్‌షీట్లు సరఫరా కాకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకుని వాడుకుంటున్నారు. దుస్తులు కూడా ఇంతవరకూ పంపిణీ కాలేదు. వర్షానికి రెండు గదులు ఉరుస్తున్నాయి. గదుల పైకప్పు కాంక్రీటు పెచ్చులూడిపోయి ఇనుప కమ్మీలు కనిపిస్తున్నాయి. పైపులైను పాడవడంతో రెండు వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. సిమెంట్ తొట్టిలో నీరు నింపి వాటిని వాడుకుంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. దీంతో పగలు పశువులు, రాత్రిళ్ల పాములు ఆవరణలోకి వస్తున్నాయి. వార్డెన్ పోస్టు ఖాళీగా ఉండటంతో రేణిగుంట వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ఏర్పేడు బీసీ బాలుర హాస్టల్‌లో నిరుపయోగంగా నీళ్ల ట్యాంకులు



బీఎన్ కండ్రిగ హాస్టళ్లు భిన్నమేమీ కాదు



బీఎన్ కండ్రిగ ఎస్సీ బాలుర హాస్టల్ భవనం కట్టి 30 ఏళ్లవుతోంది. గోడలు కూడా బీటలు వారాయి. కిటికీల తలుపులు పగిలిపోయాయి. బీసీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్మాణం ఆరేళ్లుగా అసంపూర్తిగానే వుంది.

దురవస్థలో సత్యవేడు హాస్టళ్లు



సత్యవేడు బీసీ బాలుర హాస్టల్ గదుల పైకప్పు దెబ్బతింది. కాంక్రీటు పెచ్చులూడిపోయి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. గదులన్నీ వర్షానికి ఉరుస్తున్నాయి. గోడలు నానిపోయి చెమ్మ తేలి ఉన్నాయి. కిటికీల తలుపులు పుచ్చిపోయాయి. సత్యవేడులోనే ఎస్సీ బాలుర హాస్టల్ పైకప్పు కూలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. వంట గది చూస్తే అన్నం తినబుద్ది కాదు. వాచ్‌మెన్ పోస్టు ఖాళీ. వంట మనిషే అన్ని పనులూ చేస్తున్నారు.

డక్కిలిలో అధ్వానంగా బీసీ హాస్టల్

డక్కిలి బీసీ బాలుర హాస్టల్‌లో గదులన్నీ అధ్వానంగా వున్నాయి. కిటికీలకు తలుపులు పూర్తిగా ఊడిపోవడంతో గోతాములు కట్టి మూసేశారు. వర్షానికి గదులు ఉరుస్తున్నాయని విద్యార్థులు చెప్పారు. బాత్‌రూమ్ దుర్వాసన వెదజల్లుతోంది.



అసంపూర్తి భవనంలో నాయుడుపేట కాలేజీ హాస్టల్

నాయుడుపేట బీసీ సంక్షేమ కళాశాల వసతి గృహం అద్దె భవనంలో నడుస్తోంది. భవన నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ఫ్లోరింగ్ పూర్తి కాలేదు. గోడలకు ప్లాస్టరింగ్ జరగలేదు. కిటికీలు, తలుపులు కూడా ఏర్పాటు కాలేదు. ఆ గదుల్లోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు.



కూలిపోయే స్థితిలో పిచ్చాటూరు హాస్టల్

పిచ్చాటూరు ఎస్సీ బాలుర హాస్టల్ భవనం ప్రమాదకర స్థితిలో ఉంది. పైకప్పు మొత్తం దెబ్బతిని ఏ క్షణాన్నైనా కూలిపోయేలా వుంది. ప్రహరీ లేకపోవడంతో హాస్టల్ చుట్టూ వర్షానికి నీరు చేరుతోంది.

పోలీసులకు రుణపడి ఉండాలి

● అమరవీరుల సంస్మరణ సభలో కలెక్టర్ వెంకటేశ్వర్



అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్, ఎస్పీల నివాళి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎండనక, వాననక సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పనిచేసే పోలీసులకు యావత్ జాతి అంతా రుణపడి ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకాంక్షించారు. తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలో సోమవారం జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. అమరవీరుల దినోత్సవంలో మనం భాగస్వాములు కావడం, వారి సేవలను స్మరించుకోవడం, వారికి సంతాపం తెలపడం మన విధిగా భావించాలన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ దిశగా ముందుకు వెళుతున్నామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పోలీసు అమరవీరుల స్మృతి దినంకు హాజరయ్యే అవకాశాన్ని తాను గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మన జిల్లాలో విధి నిర్వహణలో అసువులు బాసిన ఎనిమిది మందిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. కాగా, విధి నిర్వహణలో అసువులు బాసిన ఎస్ఐ రెడ్డినాయక్, ఏఎస్ఐ యువరాజులు నాయుడు, హెడ్‌కానిస్టేబుళ్ల చలపతి రాజు, ఇలియాజ్, శ్రీధర్ బాబు, నాగరాజు, కానిస్టేబుళ్ల విద్యాసాగర్, అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులను కలెక్టర్, ఎస్పీ పరామర్శించి ఘనంగా సన్మానించారు. అనంతరం జ్ఞాపికలు అందజేశారు. వారి కుటుంబాలకు తమ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, డీఎస్పీ వెంకటనారాయణ, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది, రిజర్వు పోలీసులు పాల్గొన్నారు.

స్పృహ తప్పిన కానిస్టేబుల్



పరేడ్ నిర్వహణలో ఉన్న రిజర్వు కానిస్టేబుల్ ఉదయకుమార్ గుండె పోటుకు గురై స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు అక్కడకు చేరుకుని అతన్ని పరామర్శించారు. ప్రాథమిక వైద్యం అందించాక రుయాకు తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగానే వున్నట్లు పోలీసు అధికారులు చెప్పారు.



బతుకు 'ఊయల'

అటు బండిపై టిఫిన్ అంగడి. ఇటు ఊయలలో బిడ్డ. బతుకు పనులు చూసుకుంటూ.. ఊయలలో ఏడిచే బిడ్డను సముదాయించేందుకు ఆ తల్లి పడుతున్న వేదన అక్కడి వారిని కదిలించింది. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన నాగరాజు దంపతులు ఏడేళ్ల క్రితం తిరుపతికి వలసొచ్చారు. తిమ్మినాయుడు పాళెం రోడ్డు మలుపువద్ద ఉదయం, సాయంత్రం టిఫిన్ బండి పెట్టుకుంటున్నారు. దీని పక్కనే ఫ్లెక్సీ కోసం ఏర్పాటుచేసిన ఇనుపకమ్మీ, విద్యుత్ స్తంభానికి చీరతో ఊయల కట్టి రెండో కొడుకును పడుకోబెట్టి.. ఆడించుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నారామె. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

నడిరోడ్డుపైనే 'సిట్టింగ్'

ఎక్కడా చోటే లేదన్నట్లు, నడిరోడ్డుపైనే సిట్టింగ్ వేశారు మందుబాబులు. తిరుపతి రూరల్ మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్‌కు వెళ్లే దారిలో సోమవారం మధ్యాహ్నం ఇలా మద్యం సీసాలు, స్నాక్స్ తెచ్చుకుని తాగడం మొదలు పెట్టారు. ఆ సమయంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడ్డారు. ఒకరిద్దరు అడిగితే.. ఎదురుతిరిగారు. మందుబాబులతో గొడవ ఎందుకని వారు వెళ్లిపోయారు. ప్రతి రోజు ఇక్కడ మందుబాబుల వీరంగం ఉంటోందని, స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



కలెక్టరేట్‌లో 'వర్మీకంపోస్టు'



తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన స్టాల్‌లో వర్మీ కంపోస్టు ప్యాకెట్లను విక్రయించారు. దీనిని పండ్లు, కూరగాయల మొక్కలకు ఎరువుగా వాడుకోవచ్చని ప్రజలు దీనిని ఆదరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కరకంబాడీ పంచాయతీ నుంచి వర్మీ కంపోస్టును ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నామన్నారు. డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

అమ్మ..నాన్న.. తిరుమలా..!

- స్వామితో గొప్ప అనుబంధం నాది అంటున్న దర్శకుడు శ్రీను వైట్ల

'విశ్వం' సినిమా విజయానందాన్ని తిరుమల శ్రీనివాసుడితో పంచుకోవడానికి తిరుమలకు వచ్చారు దర్శకుడు శ్రీను వైట్ల. వెంకీ, దూకుడు, ఆగడు, బాద్‌షా, ఢీ, రెడీ, కింగ్, దుబాయ్ శీను.. వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాయించుకున్న ఆయనతో తిరుమలలో ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంభాషణలోని ముఖ్యాంశాలు..

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుమల నా ఇల్లు అనిపిస్తుంది

నాకు ఊహ తెలియకముందు అమ్మానాన్నలు తిరుమలకు తీసుకువచ్చారు. పదిహేనేళ్ల వయసు నుంచీ నా తిరుమల ప్రయాణాలన్నీ నాకు గుర్తున్నాయి. నా సొంత ఇంటికి వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది ఇక్కడికి రాగానే. నాకు తెలిసి ప్రతి మనిషికి తిరుమలతో ప్రత్యేక అనుబంధం ఉంటుంది. నా పేరు కూడా శ్రీనివసే! ఇక్కడికి రాగానే ఇతర విషయాలన్నీ మరచిపోతాను. స్వామిని దర్శించుకోగానే ఒక పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. నా మనసు బాగాలేనపుడు తిరుమలకు వెళ్తే బావుండునని పిస్తుంది. నేను చేసే ప్రతి పనీ స్వామికి చెప్పి చేయడం అలవాటైపోయింది. నేను చేపట్టిన పని విజయవంతం కావాలని ప్రార్థిస్తుంటా. మనకేదన్నా కావాలన్నా, ఏదన్నా చెప్పుకోవాలన్నా తల్లిదండ్రులే గుర్తుకొస్తారు. నాకు శ్రీవేంకటేశ్వరస్వామి గుర్తుకొస్తాడు. ఆయనతోనే అన్నీ పంచుకుంటా.

స్వామికి థ్యాక్స్ చెప్పేందుకు వచ్చాం

ఇటీవల విడుదలైన 'విశ్వం' సినిమా మంచి విజయాన్ని సాధించింది. చాలా గ్యాప్ తర్వాత అత్యంత జాగ్రత్తగా తీసిన సినిమా విశ్వం. చాలా సంతోషంగా ఉంది. స్వామికి థ్యాంక్ చెప్పేందుకు వచ్చాం.

ప్రసాదాలు అద్భుతం

ప్రసాదాల విషయంలో గతంలో కొంత అసంతృప్తిగా అనిపించింది, ప్రస్తుతం చాలా బాగున్నాయ్. దర్శనం కాగానే ప్రసాదాలు తీసుకున్నా. అద్భుతంగా అనిపించింది.

మాటే మంత్రమైంది

'విశ్వం' విడుదలైన తర్వాత రివ్యూలు అటుఇటుగా వచ్చాయి. అవన్నీ వ్యక్తుల అభిప్రాయాలు. కానీ ప్రేక్షకుల నోటి మాట ఎంత బలంగా ప్రచారం అయిందంటే.. విడుదలైనప్పటి నుంచి కలెక్షను ఏమాత్రం తగ్గడం లేదు. అదనంగా మరో 300 థియేటర్లు పెరగడం అనేది మాములు విషయం కాదు. మంచి మాటే మంత్రంలా పనిచేసింది. మంచి సినిమాను శ్రీవేంకటేశ్వరస్వామే కాపాడారు. గోపిచంద్‌తో సహా పృథ్వీ, సునీల్, వెన్నల కిషోర్ అందరూ ఫర్ఫెక్ట్‌గా చేశారు.

తర్వాతి చిత్రం కామెడీనే

విశ్వం సినిమా హిట్ కావడానికి ప్రధాన కారణం కామెడీనే అంటున్నారు. నా నుంచి ఫుల్ లెంగ్త్ కామెడీ సినిమాలే ప్రేక్షకులు కోరుకుంటున్నారు. నా తర్వాతి చిత్రం ఫుల్ లెంగ్త్ కామెడీతోనే ఉంటుంది. అందరినీ మనసారా నవ్వించగలుగుతున్నానంటే అది నా అదృష్టం.

శ్రీవారి ఆలయానికి సమీపంలో ప్రయాణించిన హెలికాప్టర్



తిరుమల, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలో సోమవారం ఓ హెలికాప్టర్ ప్రయాణించడం కలకలం సృష్టించింది. సాధారణంగా ఆలయ ఆగమ శాస్త్రం ప్రకారం గర్భాలయం పైభాగంలో విమానాల రాకపోకలుండకూడదు. అయితే కొద్ది నెలలుగా తిరుమల క్షేత్రం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు ప్రయాణిస్తూనే ఉన్నాయి. దీనిపై ఇప్పటికే పలుమార్లు అర్చకులు, ఆగమ పండితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తిరుమలను నోఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని టీటీడీ గతంలో అనేకసార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అయితే నోఫ్లయింగ్ జోన్‌గా తిరుమలను ప్రకటించడం సాధ్యం కాదని కేంద్రమూ స్పష్టం చేసింది. కానీ భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని వీలైనంతవరకు తిరుమల క్షేత్రం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు. అయితే ఇటీవల తిరుమలపై విమానాలు ప్రయాణిస్తూనే ఉన్నాయి. తాజాగా సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హెలికాప్టర్ భారీ శబ్దంతో ప్రయాణించడంతో మళ్లీ నో ఫ్లయింగ్ జోన్ అంశం తెరపైకి వచ్చింది. ఈ హెలికాప్టర్‌పై ఉన్న లోగోను పరిశీలిస్తే ఇండియన్ ఆర్మీకి సంబంధించినదిగా తెలుస్తోంది. దీంతో టీటీడీ అధికారులు మౌనంగా ఉండిపోయారు.

193కి 131 భూ సమస్యలే

- సమస్యల పరిష్కారానికి నిరసనలు, ఫిర్యాదులు
- పీజీఆర్ఎస్‌కు తరలి వచ్చిన జనం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)'కు 193 అర్జీలు వచ్చాయి. వీటిలో 131 రెవెన్యూకు సంబంధించి భూ సమస్యలే ఉన్నాయి. ప్రతి అర్జీని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, సెప్షల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, నరసింహులు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇక, ప్రజా సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ పలువురు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మిగతా వారు అధికారులకు వినతిపత్రాలిచ్చారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు

జీతాల చెల్లింపుల్లో జాప్యం

ఏఈఎమ్ఎస్ సంస్థ 108 నిర్వహణ బాధ్యతలు చేపట్టాక ప్రతి నెలా జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని 108 ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. ఇలాగైతే కుటుంబాలను ఎలా పోషించాలని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. నాలుగురోజులుగా ఏఈఎంఎస్ సంస్థ ఉద్యోగులకు ఒక ఇంక్రిమెంట్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. 108 సర్వీసులో ఉన్న ఉద్యోగులకు(ఎంటీటీ, పైలెట్) ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. 8 గంటల పనివిధానాన్ని అమలు చేయాలన్నారు. ఇక 108 వాహనాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నేటి నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజా, అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు శ్యామ్, మహిళా నాయకురాలు శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల ఆవరణలో మద్యం షాపులు తొలగించండి

తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె విద్యాసంస్థల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలు తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి కోరారు. ఎంఆర్‌పల్లి, సీతంరోడ్డు సమీపంలో నిబంధనలు ఉల్లంఘించి విద్యాసంస్థల సమీపంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారన్నారు. దీనివల్ల విద్యార్థుల భద్రతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనిపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, అశోక్, నరేంద్ర, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ఆక్రమించిన ఈసీఎల్‌పై చర్యలు తీసుకోండి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న చిందేపల్లి గ్రామస్థులు

ఏర్పేడు మండలం చిందేపల్లికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును అక్రమంగా మూసివేసిన ఈసీఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని.. ఆ రోడ్డును తమకు వదిలిపెట్టాలని ఆ గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చిందేపల్లె గ్రామానికి పూర్వీకుల నుంచి పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి నుంచి రాచగున్నేరి పంచాయతీ ఛటర్జీ నగర్‌మీదుగా 40 అడుగుల రోడ్డు ఉందన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డును ఈసీఈఎల్ యాజమాన్యం మూసేసి తమను అడ్డుకుంటోందని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని వాపోయారు. గ్రామస్థులు వెంకయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానించండి

గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి అందులోని సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బరామయ్య, కిరణ్‌యాదవ్ తదితరులు కోరారు. కలెక్టరేట్ వద్ద వీరు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినా.. పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో గందరగోళం ఏర్పడిందన్నారు. చాలా పంచాయతీల్లో రెండు నుంచి 5 సచివాలయాలను ఏర్పాటు చేశారని, అవసరానికిమించి ఉద్యోగులు ఉన్నారన్నారు. అలా కాకుండా గ్రామపంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, అక్కడి సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలన్నారు.



ముగిసిన టెట్

- చివరి రోజు అభ్యర్థులకు కష్టాలు
- 16 రోజులుగా 9 కేంద్రాల్లో పరీక్షలు



పరీక్ష కేంద్రం వెనుక ప్రవేశ మార్గం వద్ద అభ్యర్థులు

తిరుపతి విద్య, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16 రోజులుగా సాగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సోమవారంతో ముగిసింది. జిల్లావ్యాప్తంగా 9 కేంద్రాల్లో ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. 36,759 మంది నమోదు చేసుకోగా 31,840 మంది హాజరయ్యారు. 4,919 మంది గైర్హాజరయ్యారు. సోమవారం జిల్లాలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. నాగలాపురం శ్రీవెంకటపెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాల, రంగంపేట, రామిరెడ్డిపల్లెలోని అయాన్ డిజిటల్ జోన్, తిరుపతి చెర్లోపల్లిలోని అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 1,507 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,299 మంది పరీక్షలకు హాజరయ్యారు. 208 మంది గైర్హాజరయ్యారు.



పరీక్ష కేంద్రం ఎదుట ప్రధాన మార్గాలను మూసేయడంతో ఖాళీగా ఉన్న ప్రధాన ప్రవేశ మార్గాలు

అభ్యర్థులకు కష్టాలు

టెట్ పరీక్షల చివరి రోజున తిరుపతి చెర్లోపల్లి అయాన్ డిజిటల్ జోన్‌లో అభ్యర్థులకు కష్టాలు ఎదురయ్యాయి. అనంతపురం, కడప, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి అభ్యర్థులు వచ్చారు. సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లను భద్రపరిచేందుకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయడంతో అభ్యర్థులు రెండుచోట్ల క్యూలలో గంటలకొద్దీ వేచి ఉండాల్సి వచ్చింది. పరీక్ష కేంద్రంలోకి రెండు ప్రవేశ మార్గాలు ఉన్నప్పటికీ కేంద్ర వెనుకవైపున్న ఓ చిన్నపాటి మార్గంలోంచి ప్రవేశం కల్పించడంతో అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలో తాగునీరు పెట్టలేదని తెలిపారు. పరీక్ష జరుగుతున్న సమయంలో అధికారులు మైకులో సూచనలు చేయడం ఏకాగ్రతకు భంగం కలిగించిందని, సిబ్బంది తమపట్ల దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు.

వైసీపీ ఎమ్మెల్సీ దందా కేసు విచారణ వేగవంతం


తిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను అధిక ధరకు విక్రయించిన కేసు విచారణ వేగవంతంగా జరుగుతోంది. వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానం బెంగళూరుకు చెందిన భక్తులకు వీఐపీ బ్రేక్ దర్శనం చేయించిన ఘటన ఆదివారం వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విజిలెన్స్ వింగ్ అధికారులు నివేదిక మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏ1గా చంద్రశేఖర్, ఏ2గా జకియా ఖానం, ఏ3గా కృష్ణతేజను చేర్చారు. ఈక్రమంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈకేసులో ఇంకా ఎవరైనా ఉన్నారా, ఎమ్మెల్సీ సిఫార్సులపై ఇంకా ఏవైనా అక్రమాలు జరిగాయా, ఎంత కాలం నుంచి ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయనే అంశాలపై పోలీసులు గోప్యంగా విచారణ చేస్తున్నారు.

డీఎస్సీ శిక్షణ దరఖాస్తులకు గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్సీ విధానంలో ఇస్తున్న ఉచిత డీఎస్సీ శిక్షణ దరఖాస్తులకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి చెన్నయ్య సోమవారం తెలిపారు. అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

శ్రీసిటీలో ఇద్దరు కార్మికుల మధ్య ఘర్షణ

- ఒకరి మృతి



ముర్ము మృతదేహం

వరదయ్యపాలెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ చెరివి గ్రామ సమీపంలో మద్యం మత్తులో ఇద్దరు కార్మికుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో జార్ఖండ్ రాష్ట్రం బత్వా గ్రామానికి చెందిన షికారీ ముర్ము(39) మృతి చెందాడు. శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. శ్రీసిటీ పరిధిలో చెరివికి సమీపంలో ఓ కంపెనీ నడుస్తోంది. దీని పక్కనే షెడ్లలో జార్ఖండ్, ఇతర ప్రాంతాలకు చెందిన కార్మికులు నివసిస్తుంటారు. ఈ షెడ్లలో నివసిస్తున్న కాంటాక్టు కార్మికుడు షికారి ముర్ము.. అక్కడే ఉన్న మరో కార్మికుడు విక్రమ్ ముర్ము తల్లిని దూషించాడు. దీనిపై అతడు షికారి ముర్ముతో ఆదివారం రాత్రి ఘర్షణ పడ్డాడు. ఇద్దరు తాగిన మైకంలో కిందపడ్డారు. విక్రమ్‌ముర్ము కొట్టిన దెబ్బలకు షికారి ముర్ము మృతి చెందాడు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

ఎన్‌బీకేఆర్‌లో రోబోటిక్స్‌పై శిక్షణ

కోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇండ్రస్టియల్ రోబోటిక్స్ కంట్రోల్ అండ్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనచేసి తరగతులను ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ పై డైప్యాక్టోకు చెందిన ఇంజనీర్లు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఆ కంపెనీ ఇంజనీర్ నందగోపాల్ ఆట్లాడుతూ రాబోయే రోజుల్లో పరిశ్రమల్లో రోబోటిక్స్‌పై విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అదే విధంగా పరిశ్రమలు డిజిటల్ మ్యానిప్యాక్చరింగ్ వైపు అడుగులు వేస్తున్నా యన్నారు. మరో ఇంజనీర్ ప్రోమిత్ కుమార్ మాట్లాడుతూ మెకానిక్ విద్యార్థులకు డోమైన్ స్కిల్ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు ఉన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



అర్బన్ మార్కెట్‌లో మహిళలు

గూడూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని మెప్మా సీఎంఎం పెంచలయ్య అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో సోమవారం అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అనేక పథకాలను అమలు చేస్తూ చేయూతనందిస్తున్నాయన్నారు. పొదుపు సంఘాల సభ్యుల బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించి ఆర్థికాభి వృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో చందన, శీను పాల్గొన్నారు.

కౌలుకిచ్చిన భూమి ఇవ్వలేదని ఫిర్యాదు

గూడూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కౌలు చేసుకునేందుకు పొలాన్ని ఇస్తే తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాడని కోట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన జమీల సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరింది. జమీల చిట్టేడు గ్రామంలో తనకున్న 71 సెంట్లు భూమిని ఫయాజ్ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చింది. ఆ భూమిని తిరిగి ఇవ్వాలని కోరడంతో ఆ వ్యక్తి ఇవ్వనని అడ్డం తిరిగాడని తెలిపింది.

రెండు మోటార్ బైక్‌ల ఢీ: ఇద్దరికి గాయాలు

చిట్టమూరు, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తగుంట కట్టెల దొడ్డి సమీపంలో సోమవారం రెండు మోటార్ బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బురదగాలి కొత్తపాళెం గామానికి చెందిన మురళి, ఆరూరు అనగొల్లకు చెందిన గగ్గయ్య మోటారు బైక్‌లు కట్టెల దొడ్డి సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడగా వారిని 108 వాహనంలో వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.







పశువులు, పందుల బెడద తప్పించండి సారూ!



సూళ్లూరుపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో పశువులు, పందుల బెడదతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు వార్డుల్లోనూ ఆవులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఆవుల యజమానులు ఉదయం పాలు పితికిన తరువాత వాటిని రోడ్లపైకి వదిలేస్తున్నారు. అవి రోడ్లపై తిరుగుతూ దుకాణాల ముందు వ్యర్థాలను తిని చెత్త చెదారాన్ని చిందరవందర చేస్తున్నాయి. ప్రధాన వీధుల్లో వాహనాలకు అడ్డు వస్తుండంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు పలు ప్రాంతాల్లో పందుల సంచారం ఎక్కువైంది. వీధుల్లో, ఇళ్ల మధ్య తిరుగుతూ అపరిశుభ్ర వాతావరణాన్ని కల్పిస్తుండడంతో విపరీతమైన దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో రోడ్లపై పశువులు, పందుల సంచారాన్ని నియంత్రించాలని కౌన్సిలర్లు పలుసార్లు సమావేశాల్లో మొత్తుకొంటున్నా అధికార యంత్రాంగంలో చలనం లేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పందులు వీధుల్లో సంచరిస్తూ పారిశుధ్య లేమికి కారణమవుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పట్టణంలో రోడ్లపై పశువులు, పందుల సంచారాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమణ తొలగింపు

గూడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు కటాలమ్మ ఆలయం సమీపంలో ఆర్అండ్‌బీ స్థలంలో ఆక్రమణను సోమవారం అధికారులు తొలగించారు. కటాలమ్మగుడి సమీపంలోని బస్‌షెల్టర్ వద్ద చెన్నూరు గ్రామానికి చెందిన కొందరు ఆర్అండ్‌బీ స్థలాన్ని అక్రమించుకునేందుకు మట్టి తోలి చదును చేశారు. ఈ విషయాన్ని సీపీఎం నియోజక వర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో అక్రమణను తొలగించారు.

వెంకటరెడ్డిపాళెంలో రెవెన్యూ గ్రామసభ

ఓజిలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం వెంకటరెడ్డిపాళెంలో సోమవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. పలువురు రైతులు తమ భూములకు సంబంధించిన వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్వేయరు లక్ష్మీనారాయణ, వీఆర్వో చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో కర్లపూడి తాగునీటికీ ఇబ్బందులు

కోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్లపూడి గ్రామం సోమవారం ఉదయం నుంచి రాత్రంబవళ్లు అంధకారం లోనే ఉంది. ఇక్కడ దళితవాడలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో దళితవాడ వాసులకు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

24న ఐటీఐలో జాబ్ మేళా

వెంకటగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, ఐటీఐ ప్రిన్సిపాల్ ఉమారాణి తెలిపారు. అమరాజా గ్రూప్, ఫోర్డ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ప్యానాసోనిక్‌లైఫ్ సొల్యూషన్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, డిగ్రీ ఉతీర్ణులైన వారు అర్హులని చెప్పారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, బయోడేటాతో హాజరు కావాలన్నారు. వివరాలకు 7013509543, 9491458910 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి గ్రామసభలు

చిల్లకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 22 నుంచి నవంబరు 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రబీ పనులు షురూ



గూడలి వద్ద నాట్లు వేసేందుకు ట్రాక్టర్‌తో అడుసు దున్నుతున్న రైతు



కొక్కుపాడు వద్ద వరినారు

కోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రబీ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. స్వర్ణముఖినది పరివాహక గ్రామాల్లోని రైతులు ఫిల్టర్ పాయింట్‌ల కింద పొలాల్లో అడుసు దుక్కి చేస్తున్నారు. కొందరు నారుమడులు పోసుకొని నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు చెరువుల్లో నీరు చేరడం, మును ముందు వర్షాలు పడుతాయన్న నమ్మకంతో చెరువుల కింద ఆయకట్టు రైతులు నారుమడులు పోసుకుంటున్నారు. ప్రధానంగా గూడలి, దక్షిణపొలం, తిన్నెలపూడి, కాకితోపు, వెంకన్నపాళెం, రంగన్న గుంట, తిమ్మానాయుడుపాళెం, వంజివాక తదితర గ్రామాల్లోని రైతులు ఫిల్టర్ పాయింట్ ద్వారా నార్లు పోసుకొని నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అదేవిధంగా ఊనుగుంటపాళెం, రుద్రవరం, చిట్టేడు, చెందోడు, చంద్రశేఖరపురం, నెల్లూరుపల్లి కొత్తపాళెం, వీపీ అగ్రహం, జరుగుమల్లి, కర్లపూడి గ్రామాల రైతులు చెరువుల కింద నార్లు పోసుకుంటుండగా, కొంత మంది చెరువుల్లో ఉన్న నీటితోనే నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

పల్లెసీమలను ప్రగతి బాటలో నడిపిస్తాం: పాశిం



పైపులైన్ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

కోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు అభివృద్ధికి దూరంగా ఉన్న పల్లె సీమలను ప్రగతి బాటలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోట మండల పరిధిలోని సిద్ధమ్మకండ్రిగలో జీవీఆర్ రొయ్యల పరిశ్రమ రూ.5లక్షల వ్యయంతో నిర్మించే ఆర్‌వో ప్లాంట్‌కు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేగ్రామంలో రూ.4.80 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదే విధంగా కేశవరం ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి సిద్ధమ్మకండ్రిగ గ్రామానికి రెండు కిలోమీటర్ల పైపులైన్ పనులకు భూమిపూజ చేశారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలకు సంబంధించి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దాలి సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, చాపల శ్రీనివాసులు, చిట్టేటి నాగూరయ్య, కోటేశ్వర ప్రసాద్, జడ వేణు, కసుమూరు వెంకటేశ్వర్లు, ఏపీడీ వరప్రసాద్, ఏపీఎం అనీల, తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, మధుయాదవ్, ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి: విజయశ్రీ



పున్నేపల్లిలో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చెప్పారు. ఓజిలి మండలం పున్నేపల్లి, నెమళ్ళపూడి, కరబల్లవోలు గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఆమె సోమవారం శంకుస్థాపన చేశారు. పున్నేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్ దీపాలు, అంతర్గత రోడ్లతో పాటు పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మండల కన్వీనర్ గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, కుందాం మాజీ అధ్యక్షుడు కసుమూరు గోపాల్‌రెడ్డి, పురుషోత్తం రాజు, మస్తాన్‌రెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెళ్లకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు, చెన్నప్పనాయుడుపేట, శిరసనంబేడు గ్రామాల్లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సూళ్లూరుపేట జనసేన అధ్యక్షుడు ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు భూమిపూజ

దొరవారిసత్రం, అక్టోబరు 21: మండలంలోని మినమనమూడి, శ్రీధనమల్లి, తొగరాముడి గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే విజయశ్రీ భూమిపూజచేశారు. తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, సర్పంచు ప్రసాద్ నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో దాడుల సంస్కృతి లేదు

నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దాడుల సంస్కృతి టీడీపీలో లేదని నెలవల ఆ పార్టీ సూళ్లూరుపేట ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. సోమవారం శిరసనంబేడులో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పెంచి పోషించిన వ్యక్తులే ఆయనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా వివాదానికి పాల్పడ్డారని తెలిపారు. మద్యం సిండికేట్‌కు ఒప్పుకోలేదని కామిరెడ్డిపై టీడీపీ నాయకులు దాడి చేయించారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో 127 పంచాయతీల్లో ఎక్కడా లేనివిధంగా ఒక్క చిల్లకూరులో మాత్రమే శాంతిభద్రతలకు విఘాతం ఎందుకు కలుగుతోందో వైసీపీ నేతలు ఆలోచించుకోవలన్నారు.

పల్లెపండుగతో గ్రామాల అభివృద్ధి

చిల్లకూరు, అక్టోబరు 21: పల్లెపండుగ కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని కాకువారిపాళెం, బల్లవోలు, తిక్కవరం, ముత్యాలపాడు గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శిలాఫకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి, సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, దువ్వూరు వెంకటకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, వినయ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సతీస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మన్నెం శీనయ్య, లీలావతి పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.67 లక్షలు

సూళ్లూరుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 116 రోజులకుగాను రూ.67,98,889 వచ్చినట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్

వెంకటగిరి టౌన్, అక్టోబరు 21,(ఆంధ్రజ్యోతి): అమరులైనా పోలీసులు త్యాగాలు మరువలేనివని 9వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్ పేర్కొన్నారు. సోమవారం మండల పరధిలోని 9వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అమరవీరులు ఘాట్ వద్ద నివాళులర్పించారు.మరణించిన బెటాలియన్ సిబ్బంది కుటుంబ సభ్యులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకొని వృద్ధురాలి మృతి

తడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు మృతి చెందింది. మండల పరిధిలోని మాంబట్టు గ్రామానికి చెందిన భువనగిరి శాంతమ్మ(79) ఈ నెల 5వ తేదీ ఇంట్లో కట్టెల పొయ్యి మీద నీళ్లను వేడిచేసే క్రమంలో మంటలు ఎగిసిపడి శాంతమ్మ చీరకు నిప్పంటుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారూరు గ్రామానికి కావేరి స్నేహ(22) అదృశ్యం అయినట్లు ఆమె తల్లి అముద పోలీసులకు ఫిర్యాదు చేసింది. కావేరి స్నేహ పుట్టుకతోనే బధిరురాలు. ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో కావేరిస్నేహ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యాయామ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ అతిథి అధ్యాపకుడిగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశేఖరం తెలిపారు. ఎంపీఈడీ, నెట్, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పార. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదిలోగా కళాశాల పనివేళల్లో దరఖాస్తు అందజేయాలని కోరారు.

రెవెన్యూ రికార్డుల పరిశీలన

బాలాయపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలంలో గత ప్రభుత్వ హయాంలో ఫ్రీహోల్డ్ అయిన అసైన్డ్ భూముల రికార్డులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుజన పరిశీలించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆమె ఫ్రీహోల్డ్ అయిన అసైన్డ్ భూములు, మేతపోరంబోకు నుంచి అనాదీనంగా మారిన, అటవీ భూమిని మార్పు చేసి పట్టాలు, వాటి లబ్ధిదారులు వివరాలను నిశితంగా పరిశీలించారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

వెంకటగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పాఠశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, మంజుల మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు చాలక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వేతనాలు రూ.6వేల నుంచి రూ.26 వేలకు పెంచాలని, నాలుగు నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాల కోరారు. అనంతరం ఎంఈవో వెంకటేశ్వరావుకు వినతిపత్రం అందచేశారు.

యువకుడి ఆత్మహత్య

చిట్టమూరు, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోగిలి రొయ్యల గుంటల వద్ద తుపాకుల చెంచుకృష్ణయ్య(30) సోమవారం గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నాడు. రొయ్యల కాలువ వద్ద కాపలాదారుగా ఉన్న చెంచుకృష్ణయ్య కుటుంబ కలహాలతో గులికలు తిన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.